శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



శ్రీరామనవమి సంచిక

# గురుకృప

సత్యం ఆయన మెచ్చిన తత్త్వం

సంపుటి : 16
ఏప్రిల్ 19

# గురుకృప

సంచిక : 2
2013

## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

### లోపలి పేజీలలో

త్రికరణ శుద్ధి - భక్తి వృద్ధి 3
- గురుకృప

సత్సంగం 5
- శరచ్చంద్రికలు

దిష్టిబొమ్మలు 12
- శరచ్చంద్రికలు

బాబాకు పగ్గాలప్పగించడం ఎలా? 19
- శరచ్చంద్రికలు

లభించిన దానితో తృప్తిపడు 24
- గురుకృప




నిర్వహణ : గురూజి ఆశీస్సులతో - గురుబంధువులు
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# త్రికరణ శుద్ధి - భక్తి వృద్ధి

ఒకానొక రోజున ముగ్గురు వేద పండితులు ఒక మహాత్ముని చెంతకు చేరారు. వారి చరణాలు పట్టుకొని మహాత్మా! మాకు మీరు ఉపదేశం చేయాలని వేడుకున్నారు. పండిత ప్రముఖులు వేద వేదాంగాలు ఉపనిషత్తులు, భగవద్గీత మున్నగు ఆధ్యాత్మిక గ్రంథరాజములను అవపోసన పట్టినవారు. కలవరించినా, పలకరించినా వారినోట వెంట అవే వచ్చేవి. ఉపదేశానికై వేడుకున్న వారితో నవ్వి, "రేపు ఉదయం స్నానం చేసి నా వద్దకు రండి!" అని చెప్పారు. ఆ మహాత్ముడు. సరే ఉదయం ఆశ్రయించిన ఆ పండితులతో ఆయన ఇలా అన్నారు "మీరు చదువుకున్న గ్రంథాలలో ఏ వాక్యము, ఏ పంక్తి, మంత్రం అనే నమ్మకం కలగలేదా? కలగకపోతే ఇప్పుడు నేను ఉపదేశం ఇచ్చినా ఏ ప్రయోజనం లేదు. కలిగితే నేనివ్వటం అనవసరం. ఇదే మంత్రం వెళ్లండి" అన్నారు. పండితుల స్థితే – ఈనాటి మన పరిస్థితి. ఇదీ నిజంగా మన భక్తి వైచిత్రి.

నిత్యమూ నోటవల్లె వేస్తున్న నామములేగానీ, పఠిస్తున్న సద్గ్రంథములేగాని దేనినీ నోట మాటలుగా మిగలకుండా తత్త్వము జీర్ణించుకొని, జీవన 'క్రియ'లో చొప్పించి, జీవితాన్ని ఒక చక్కటి కూర్పులో మలచుకొని, 'మనిషి'గా మిగిలిన నాడే మనిషి జీవితం సార్థకమవుతుంది. మనకు తెలిసిన 'భక్తి' – యొక్క రూపాన్ని మరొక్కసారి ఎవరికి వారు పునశ్చరణ చేసుకుందాం. నోములు, వ్రతాలు, దీక్షలు, పురాణ ప్రవచనాలు, పూజలు, ఉపవాసాలు, తిలకధారణలు – ఇలా ఎన్నో ఇవన్నీ భక్తికి చిహ్నాలుగా భావించడం కద్దు. ఇవన్నీ 'భక్తి' కాదని అనట్లేదు! కాని మనో, వాక్కాయములన్నీ త్రికరణాలు – మాట, మనసు, క్రియ ఈ మూడు ఒకే తానులో గుడ్డలు కానంత వరకు మన భక్తి 'అసహజమే'నన్న సత్యాన్ని అవగతం చేసుకోవాల్సి ఉంది. "మనసులో తలచిన దానినే పైకి చెప్పాలి. పైకి చెప్పిన దానినే చేయాలి. ఇవే మనో వాక్కాయ కర్మలు". వీటితో సాంగత్యము లేక ఒకదానికొకటి విరుద్ధముగా నున్న ఏ చర్యను 'భక్తి' అనలేమన్నది నిర్వివాదాంశం.

**మరి ఏది దారి?**

మనిషి మేధ (మనస్సు) సరిగా ఉంటే ఆలోచన సరిగా ఉంటుంది. కనుక మనస్సును సదా నిష్కల్మషంగా, నిష్కపటంగా, నిర్మలంగా ఉంచుకోవడం ప్రథమ కార్యం. సద్గురు చరణాలను ఆశ్రయించి ప్రతీ నిత్యం చేస్తున్న ప్రతీ పని "నన్ను ఈ పని బాబా చెంతకు చేర్చేదిగా ఉందా లేక సద్గురు పథానికి దూరం చేసేదిగా ఉందా?" అన్న గమనింపు సద్భక్తునికి అత్యావశ్యకం. ఏ భక్తుడయితే అష్టపుష్పాలను అహింస, ఇంద్రియ నిగ్రహం, భూతదయ, క్షమ, శాంతి, తపస్సు, ధ్యానం, సత్యం – అనునిత్యం సద్గురు చరణ సీమన అలంకరిస్తాడో అతడు సద్భక్తుడే అయ్యాడు. విశాలతాత్మకమైన మనస్సుకి నిశ్చయాత్మకమైన బుద్ధిని జత చేయడమే భక్తి. గీతాచార్యుడు ఇలా అంటాడు. "సమస్త ప్రాణుల యెడల ద్వేషము లేనివాడు, ప్రేమగలవాడు, అహంకార మమకారములు లేనివాడు, సుఖదుఃఖములందు సమభావము గలవాడు, ఎల్లవేళల సంతృప్తి కలవాడు, దృఢ నిశ్చయం గలవాడు, మనోబుద్ధులు నాకు సమర్పించినవాడు, మనసును స్వాధీనపరచుకున్నవాడు –



సద్భక్తి కలవాడు – అతడు నాకు ఆప్తుడు – అతడే నా నిజభక్తుడు అని” శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు. “హృదయమందిరంలో భగవంతుణ్ణి ప్రతిష్టించాలనుకుంటే ఆయన్ను పొందాలనుకుంటే, కేవలం ‘భూ, భూ’ అని శంఖం ఊదితే ఏమిటి ప్రయోజనం? మొదట మనస్సును శుద్ధి చేయి” అని. “మనస్సు పరిశుద్ధమైతే భగవంతుడు ఆ పవిత్రమైన ఆసనంలో వచ్చి కూర్చుంటాడు. గబ్బిలాల రెట్టలుంటే దేవుణ్ణి ప్రతిష్ఠించలేము. ముందు మాధవుణ్ణి ప్రతిష్ఠ చేయి. ఆ మీదట ఇష్టముంటే ఉపన్యాసాలు ఇవ్వు”. కనుక ఏం తెలుస్తోందంటే మనిషి ‘మనస్సును’ ముందు పరిశుభ్రం చేసుకోవాలి. ఇది భక్తికి ఆద్యము (మొదలు).

**శుద్ధి – వృద్ధి**

త్రికరణాలు శుద్ధమయితే – ‘ మనిషి’ వృద్ధి చెందినట్లే! రాముడు – సద్గురువైన వశిష్ఠుని మాటలను– తన జీవిత పర్యంతం చేతలుగా మలిచి తండ్రిమాట జవదాటని తనయుడుగా, గురువు మాటను నిలుపుటకై కోదండం ధరించి దానవ సంహారిగా, శీలమును ఆభరణముగా ధరించి తన పద స్పర్శచే ‘రాతి’ని ‘నాతి’గా మార్చిన దివ్యాంశ సంభూతునిగా నిలిస్తే, రావణుడు ఆత్మలింగమునే సాధించిన పరమశివభక్తుడు అయి ఉండి, సదా శివపూజలో నిమగ్నమయ్యే సాధకుడిగ నిలిచి, భక్తి పారవశ్యంలో శివునితో తాదాత్మ్యం చెందగల పరమ భక్తాగ్రేసరుడే అయినా – కేవలం ‘శీల’ సంపద లేక – పూజనీయుడు కావాల్సిన వ్యక్తి – మానవుడు ఎలా ఉండకూడదో తెలుసుకునేందుకు సోదాహరణగా మిగిలాడు. అసలు విషయానికొస్తే, “ఎవరైతే త్రికరణశుద్ధిని కలిగి ‘చెప్పేమాట – నడిచే బాట’ సద్గురు పథంలోనే సాగుతుందో అతను ‘మనిషి’ అయ్యాడు. త్రికరణాలు మలినమయితే రాక్షసస్థాయికి, పవిత్రమయితే దివ్యస్థాయికి, మరపులోకి వెళితే పశుస్థాయికి చేరతాడు మనిషి.

**అందలేనిదా ఈ ‘విజయం’?**

మనిషిని శాసించే త్రిగుణాలు – త్రికరణాలను ఏకం కానియ్యవు. అయితే త్రిగుణాలను శాసించగల ఏకైక సాధనం ‘సంగం’–‘సత్సంగం’. మౌలికమైన జీవన విధానాన్ని మార్చగల శక్తి సత్సంగానికి మాత్రమే ఉంది. సత్వ, రజో, తమో గుణ సంపన్నుడైన మానవుని మనసును నిలువరించగల, సరియైన దిశలో నడిపించగల మహత్తు సత్సంగానిదే! చిందర వందరగా పడి ఉన్న పరమాణువులను ఒక సరియైన దిశలో నడిపి మానవుని – మరొక మానవునికి సూదంటు రాయిలా చేయగలిగింది సత్సంగమే!. మనిషిని ‘నిమ్నత్వం’ నుండి ‘ఔన్నత్యం’ వైపుగా అడుగులు వేయించేది సత్సంగమే! మనసుకు పట్టిన మకిలిని విదిలించి, వదిలించే ప్రయత్నానికి సరియైన బడి సత్సంగమే! మృగాలను ఆడించే మనిషి, ‘మనోమృగాన్ని’ ఆడించలేడా? సంకల్పం ఉంటే సద్గురు అనుగ్రహం తోడైతే సాధించలేనిది ఏముంది?

మనం మానవులం! సూర్యుడ్ని అస్తమించకుండా చేసిన సుమతీ! యముడ్ని వెంబడించి యమపురికి వెళ్ళి భర్తను వెంటతెచ్చుకున్న సావిత్రి, త్రిమూర్తులను పసిపాపలుగా ఊయలలూపిన అనసూయ, దివి నుండి భువికి గంగనే తెచ్చిన భగీరథుడు, మృత్యువును తోసిరాజన్న మార్కండేయుడు, ధ్రువతారగా నిలిచిన



ధ్రువుని వంటి వారికి వారసులం. అనుకుంటే సాధించలేనిది లేదని నిరూపించిన జాతికి సమకాలికులం.

అతి చంచలమైన మనస్సుకు – సద్గురు చరణాసక్తిని – కల్గించడానికి కావాల్సిన తీవ్రమైన ఆర్తి, ఆకాంక్ష, మనకు ఆ సద్గురు చంద్రులు ప్రసాదించాలని, మనమందరం ఈ 'విజయనామ' సంవత్సరంలో సత్కార్మాచరణ, దార్మిక నిష్ఠ, సత్సంగము వంటి నియమిత కర్మలను నిరంతరం ఆచరిస్తూ మన మనస్సును శుద్ధి చేసుకొని, తద్వారా 'సద్గురుభక్తి'ని వృద్ధి చేసుకోవాలని మనందరికి 'గురుకృప' అనుభవంలోనికి రావాలని ఆకాంక్షిస్తోంది గురుపత్రిక.

**మానస భజరే గురుచరణం**
**దుస్తర భవసాగర తరణం......**

## శరశ్చంద్రికలు

### సత్సంగం – *జనవరి 2013*



**గురువుగారు :** ప్రపంచం ఎంతో మరులుగొలుపుతూ ఉంటుంది. అది ఎప్పుడూ నీ మీద పడి, నిన్ను పట్టుకొని, భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తిలాగా నిన్ను క్రిందకి లాగడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. నీ చుట్టూ శూన్యాన్ని, ఆకర్షణరహితమైన వాతావరణాన్ని నువ్వే సృష్టించుకోవాలి. (గురువుగారు నవ్వుతూ...) అటువంటి **ఆకర్షణరహితమైన వాతావరణాన్ని ఏర్పరచేదే సత్సంగం.** ఆకాశంలో పైపైకి ఎగసి నక్షత్రాలను చేరుకోవాలనుకునే వ్యోమగామి అందుకు సిద్ధం కావడానికి అటువంటి భారరహితమైన వాతావరణాన్ని కల్పించుకోవడం అవసరం. అలాంటి సామర్థ్యం లేకపోతే అతను అంతరిక్షంలో వెళ్ళలేడు.

మీరు అలా ఆధ్యాత్మికపథంలో వ్యోమగాములు కావాలనుకుంటే, ఇంకా ఇంకా పైకి వెళ్ళి తారలను చేరుకోవాలంటే, ఆ ఆకర్షణ లేని వాతావరణాన్ని ఇక్కడ సత్సంగంలో కల్పించుకొని, సాధన చెయ్యండి.

**గురువుగారు :** ఏదైనా విషయాన్ని గురించి మాట్లాడడం, చర్చించడం.. ఇలా వాచా జరిగే సంభాషణే సత్సంగమని ఎప్పుడూ భావించవద్దు. ఇది సత్సంగం యొక్క ఒక కోణం మాత్రమే.

సత్సంగానికి మూడు రకాల అర్థాలున్నాయి. సంఘం అంటే సాంగత్యం, సన్నిహితంగా ఉండటం, కలిసి ఉండటం, సాహచర్యంలో ఉండడం. దేని సాంగత్యంలో? ఏదైతే ఉన్నదో ఆ సత్ పదార్థం యొక్క సాంగత్యంలో. ఏదైతే ఉన్నదో అదే సత్! "సత్–చిత్–ఆనందం"లోని సత్ అదే. "సత్–గురు"లో సత్ ఉంది. "సత్యం"లో ఉండే సత్. "ఏదైతే ఉన్నదో" అదే సత్యం. సత్ నుండే సత్యం అనే పదం వస్తుంది.



మీరే సత్స్వరూపులై ఉండి కూడా, ఇంకా గుర్తించలేని ఆ సత్యాన్ని – 'నేను' అనో, 'బ్రహ్మం' అనో, మరొకటనో – ఏమని పిలిచినా సరే, **అటువంటి సత్యంతో సాంగత్యంలో ఉండటం నిజమైన సత్సంగం.**

అయితే మనం దానిని, ఆ సత్ పదార్ధాన్ని పట్టుకోవడం ఎలా ? ఎందుకంటే మనం దానిని ఒక క్షణమాత్రం కూడా చూడలేదే ! మహాత్ములసాంగత్యంలో ఉండటమే దీనికి సాధనం . ఆ సత్ పదార్ధాన్ని అనుభవించిన సత్పురుషులసాంగత్యంలో ఉండమని శాస్త్రాలన్నీ చెబుతున్నాయి. వారి సన్నిధిలో ఉండటం సత్సంగం.

కానీ అన్నివేళలా వారి సన్నిధి మనకు లభ్యంకాదు. కాబట్టి సత్సంగం యొక్క మరో రూపం పనికి వస్తుంది : సత్యం గురించి మాట్లాడుకోవడం, చింతన చెయ్యడం – వ్యక్తిగా మన అస్తిత్వం యొక్క సత్యం గురించి, జగత్తు యొక్క సత్యం గురించి, మనం జగత్తుతో కలిగివుండే సంబంధంలోని సత్యం గురించి మాట్లాడుకోవడం... ఇలా మనం ఇప్పటివరకు మాట్లాడుకుంటున్న ఇలాంటి రకరకాలవిషయాలు, ఇంకా ఆ సత్యాన్ని దర్శించిన సత్పురుషుల గురించి మాట్లాడుకోవడం.. ఇది సత్సంగానికి మరొక రూపం.

**గురువుగారు :** "ఈ సత్సంగాలు, అనుభవాలు పంచుకోవడం... ఇవన్నీ ఏమిటీ? నేను ఆ అనుభవాన్ని పొందటానికి, వీటికి ఏమీ సంబంధం లేదు!" అని మీరనుకోవచ్చు. పంటకు, దాని చుట్టు ఉండే కంచెకు ఎలాంటి సంబంధం ఉంటుందో ఇదీ అలాంటిదే. మీరు భూమిలో విత్తనాలు నాటుతారు, అవి మొలకెత్తుతాయి. తరువాత పంట వస్తుంది. ఆ ఫలసాయాన్ని పొందాలనుకుంటే మీకు మంచి కంచె అవసరం. కంచె పంటలో భాగం కాదు, కానీ మీరు నిజంగా ఫలసాయాన్ని పొందాలనుకుంటే మాత్రం మీరు కంచె గురించి జాగ్రత్త తీసుకోవాలి, లేకపోతే మీకసలు ఆ పంట చేతికందదు.

భక్తుడు : మీరు సత్సంగం కంచె లాంటిది అని కదా అంటున్నారు?

**గురువుగారు :** అవును. మనలో చాలామంది మనస్సులు చాలా బలహీనంగా ఉండి, చుట్టుప్రక్కల గల పరిస్థితుల వలన సులభంగా ప్రభావితమవుతుంటాయి. కాబట్టి మనకు ఏదో ఒక రకమైన రక్షణ అవసరం. మనలో ప్రేమ, అనుగ్రహం అనే చిన్న మొక్క ఇప్పుడే నాటుకుంది. అది పెద్ద చెట్టుగా మారేదాకా దాని చుట్టూ కంచె కట్టి కాపాడుకోవాలి. ప్రేమ బీజాలు గాలికి రెపరెపలాడే చిన్న దీపంలా ఉన్నప్పుడు, దానికి గాలి అనేది చాలా ప్రమాదకారిగా ఉంటుంది. దానికి చిమ్నీ గాని, గ్లాసుగానీ రక్షణగా అవసరం. అదే పెద్దమంట అనుకోండి, అది పరిసరాలలో ఉన్న వాటినన్నింటినీ దహించి వేస్తుంది. మీ అన్వేషణ, మీలోని ప్రేమోద్వేగం చాలా శక్తివంతంగా మారినపుడు మీరు మీ పరిసరాలను ప్రభావితం చెయ్యగలరు, అప్పుడు మీరు ఎక్కడికి వెళ్ళినా అక్కడ సత్సంగం దానంతట అదే ఏర్పడుతుంది. కానీ పరిసరాలవలన ప్రభావితం



అవుతున్నాము అని మీరు భావిస్తున్నంతవరకు మీకు చిమ్మీ(సత్సంగం) అవసరం.

**భక్తుడు :** మీరు చెబుతున్న విధంగా బాబా గురించి ఆలోచించాలంటే, ఎవరికైనా "ఏదైతే ఉన్నదో" ఆ సత్ పదార్థం గురించి చాలా స్పష్టమైన అవగాహన ఉండాలి.

**గురువుగారు :** అందుకే బాబా జీవితచరిత్రను చదవండి, దానితో సాంగత్యంలో ఉండండి, ఆ సత్సంగంలో ఉండండి. మనం ఇవన్నీ ఎందుకు చేస్తున్నాం? ఆ స్పష్టమైన అవగాహన రావడం కోసమే మనం ఇవన్నీ చేస్తున్నాం.

**భక్తుడు :** కానీ అంతకుముందు మీరే బాబా కేవలం శిరిడిలో నివసించి, సమాధి చెందిన ఆ దేహం మాత్రమే కాదని, ఆయన పరిధి చాలా విస్తృతమని చెప్పారు.

**గురువుగారు :** అది సరే. ఏదేమైనా, మీరు అంతకు ముందు మాట్లాడిన ఆ "స్థితి" మీకు కావాలి. నేను మీకు "బాబా మీద లగ్నం చేయండి"అని చెబుతున్నాను. మీకది నచ్చినా, నచ్చకపోయినా దాని గురించి పట్టించుకోవద్దు. (నవ్వులు) చెయ్యండి. అంతే!

**భక్తుడు :** గురువుగారు ! ఇక్కడి నుండి ఇంటికి వెళ్ళిన తర్వాత మేము ఏం చెయ్యాలి? రోజువారీ ప్రాపంచిక వ్యవహారాలలో కొట్టుకుపోతామేమో అనిపిస్తోంది.

**గురువుగారు :** మహాత్ముల జీవిత చరిత్రలను, వారి సన్నిహిత భక్తుల స్మృతులను చదవండి, ఉదాహరణకు బి.వి. నరసింహస్వామివారి డివోటీస్ ఎక్స్‌పిరియెన్సెస్ ఆఫ్ సాయిబాబా, రమణాశ్రమ లేఖలు , సాయిబాబా ది మాస్టర్. ఒక్కసారి , రెండు సార్లు , మూడుసార్లు చదవండి. ఎందుకంటే ఇలా మళ్ళీ మళ్ళీ చదవడం వలన మీకు మరింత అవగాహన కలుగుతుంది. మీరన్నట్లు మీ చుట్టుప్రక్కలవాతావరణమంతా రక్షణ లేకుండా ఉంది. ఏదైనా కంచెను, మన ఆలోచనాసరళితో సరిపోయే వ్యక్తులతో అప్పుడప్పుడు కలవడం వంటి కొంత రక్షణను ఏర్పాటు చేసుకోండి. అదే సత్సంగమంటే. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మీకు దొరికే సమయాన్ని బట్టి కలసి ఒక చోట కూర్చోండి. ప్రతి నిత్యం క్రమం తప్పకుండా అందరూ కలిసి ధ్యానం చేసుకోవడంలాంటి ఆలంబన (సపోర్టు)ను ఏర్పాటు చేసుకోండి. అలా బాబా ఫోటో ముందు కూర్చుని ఆయన సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి, కళ్ళు మూసుకోవచ్చు లేదా కళ్ళు తెరచి ఆయన ఫోటో కేసి అలా చూస్తూ కూర్చోవడం మీకు నచ్చితే అలాగే కూర్చోవచ్చు.

మీకు రమణమహర్షితో అనుబంధం ఉంది కాబట్టి, ఆయన ఫోటో పెట్టుకుని, అలా కూర్చుని ఆయన జీవితచరిత్రను చదవడం వల్ల మీకు ఆయనపట్ల కలిగిన భావాలసారంతో ఆయనను చూడటానికి ప్రయత్నించండి. ఆయన ఎంత మానవత్వం కలిగి ఉండేవారో, ఆయన ఎంత ప్రేమమయులో, ఆయన ఎంతగా ప్రేమించేవారో, తమ భక్తులతో ఎంత సన్నిహితంగా ఉండేవారో చూడండి. ఆయన ముందు



కూర్చుని ఆయన ప్రేమను అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. అప్పుడు మీకు ఎంతో శాంతంగా, నిశ్చలంగా, ఆనందకరంగా అనిపిస్తే కళ్ళు మూసుకోవచ్చు. మరేమీ చెయ్యకుండా ఆ ప్రశాంతతను అలా ఆనందించండి.

మీరు ఇంటి దగ్గర ఉన్నప్పుడు ఏమైనా పాటలు మీకు తోచినట్లు పాడుకోవాలనిపిస్తే– అవి భజనలు కావచ్చు లేదా నామం కావచ్చు – మీ భాషలో మీరు పాడుకోవచ్చు. అవి మనం ఇక్కడ పాడుకునే నిర్ణీతమైన భజనలు కానక్కరలేదు. మీరు పనిచేస్తున్నప్పుడు, అంటే వంట చేస్తున్నప్పుడుగాని, తోటపని చేస్తున్నప్పుడుగానీ ఇవి చేసుకోవచ్చు. సంస్థాగతమైన వ్యవస్థ పట్ల నాకు పట్టింపులేదు. చాలా సాధారణమైన రీతిలో అందరూ కలవడానికి కాస్త సమయం పెట్టుకోండి. మనలాంటి ఆలోచనా దృక్పథం ఉన్నవారితో అనుబంధాన్ని పెంచుకోండి. ఆలోచనలను పంచుకోండి. అప్పుడు మనకు ఉండే వ్యావహారిక సంబంధాలన్నీ వారిలోనే ఉంటాయి. ఇక్కడ వీళ్ళను చూడండి.. వాళ్ళు కలిసినపుడు బాబా గురించి మాట్లాడుకుంటారు, సాయిపథం గురించి మాట్లాడుకుంటారు, గురువు గురించి మాట్లాడుకుంటారు. వారికిక వేరే విషయాలే ఉండవు – వారు సత్సంగం అనే కంచెతో పూర్తి రక్షణలో ఉన్నారు.

వాళ్ళు ఎప్పుడైనా బయటకు వెళ్ళినప్పుడు తోటి భక్తులను కలుసుకుంటారు. వాళ్ళంతా కుటుంబంలాగా, కుటుంబసభ్యులమాదిరిగా ఉంటారు. వారికేదైనా అవసరం వచ్చినప్పుడు, ప్రాపంచిక విషయాలలో కూడా తోటివాళ్ళు వారికి సహాయపడతారు – ఓ రకమైన సోదరభావం ఉంటుంది. అదే మనల్ని రక్షిస్తుంది. అదే సత్సంగం అంటే. చాలామందికి వాళ్ళను వాళ్ళు కాపాడుకోవాల్సిన అవసరం ఎప్పుడూ ఉంటుంది. అందుకే వారికి క్రమం తప్పకుండా జరిగే సత్సంగాలు అవసరం. వాళ్ళు ప్రతిరోజు కలుస్తారు. కొంతమంది ప్రతివారం కలుస్తారు. ముందుగా వాళ్ళుబాబా చరిత్రగాని, బోధనుగాని లేదా నేను వ్రాసిన వాటినిగానీ ఇలా ఏదైనా చదువుతారు. తర్వాత భజన చేస్తారు. లేదా బాబా నామాన్ని వినడం చేస్తారు. తర్వాత కాసేపు ధ్యానం, బాబా సన్నిధిని అనుభవంలోనికి తెచ్చుకోవడం చేస్తారు. కొన్ని సందర్భాలలో సమయానుకూలతను బట్టి వాళ్ళు తమ అనుభవాలను పంచుకుంటారు. తరువాత తమ తమ పనులకు వెళ్ళాల్సిన వారు వెళతారు. కాస్త తీరుబడి కలిగిన మిగిలినవారు తమ అనుభవాలను, అవగాహనను ఒకరితో ఒకరు పంచుకుంటారు.

**భక్తుడు :** ఆధ్యాత్మికమార్గంలో అడ్డంకులుగా కనిపించే వాటిని మేము ఎలా అధిగమించాలి?

**గురువుగారు :** మీకు అక్కరలేని వాటి నుండి తప్పించుకోవాలనుకోవడం కన్నా , మీకు కావలసిన దాన్ని, మీరు కోరుకునేదాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించండి. మీరు నాటిన మొక్క దగ్గర కూర్చుని దానిని తినడానికి వచ్చే పశువుల్ని, మేకల్ని తరమడానికి ప్రయత్నించకుండా దాని చుట్టూ కంచె ఏర్పాటు చేసి నిశ్చింతగా ఉండండి.



మీరు చేసే ప్రయత్నాలన్నింటికి ఇదే (కంచె ఏర్పాటు చేసుకోవడం) మూలమైనప్పుడు, అవసరానికనుగుణంగా సత్సంగం దానంతటదే ఏర్పడుతుంది. నిజమైన సాధకునికి ప్రపంచం ఎప్పుడు అడ్డంకి కాదు. ఆ మాటకొస్తే అసలు ఏదీ అడ్డంకి కాదు. ఆ వ్యక్తి యొక్క అవగాహనారాహిత్యం, అతని తెలివితేటలు, అతని ఊహాకల్పనలు.. ఇవీ నిజమైన అడ్డంకులు. అతని మార్గంలో అతనికి అతనే అడ్డమవుతాడు. అంతేగానీ బయటి ప్రపంచం కాదు. అతనికి ఏదీ అడ్డంకి కాజాలదు.

**భక్తుడు** : సత్సంగం పట్ల ఆసక్తి లేనివారిని మేము వదిలేయాలా?

**గురువుగారు :** వారికి ఆసక్తి లేకపోతే వాళ్ళే మిమ్మల్ని వదిలేస్తారు! (నవ్వులు) వాళ్ళనూ పిలవండి, మీరు వారితో పంచుకోవాలనుకునే దానిని పంచుకోండి. ఒకరు ఆసక్తిగా ఉన్నారని, లేరని మీరు నిర్ణయించకండి. మీ అనుభవాలను మీరు పంచుకోండి. అంతే ! వాళ్ళు రావాలనుకుంటే వస్తారు, లేకపోతే వెళ్ళిపోతారు. మనం సత్సంగంలో ఉండటానికి వాళ్ళు మనకు అవకాశం ఇచ్చారు. బాబా జీవితం గురించి, భగవాన్ జీవితం గురించి, ఇతర మహాత్ముల గురించి, ఆనందమార్గం గురించి వారికి తెలియజేయండి. దీనివల్ల మీరు ఏదైతే అడ్డంకి అనుకుంటున్నారో అదే మీకు ఆత్మ పరిశీలనకు, ఆలోచనల పరిశీలనకు అవకాశమిస్తుంది. నువ్వు కోల్పోయేది ఏమీ ఉండదు. ఇది నా పద్ధతి, నా మార్గం పట్ల నాకున్న అంకితభావమిది  అని అనిపిస్తుంది.

ఇంకా, వారితో మాట్లాడేటప్పుడు వేరే పరిభాషలో మాట్లాడకండి. వారికి అర్థంకాని పదజాలంతో మాట్లాడితే వాళ్ళు దానిని వేరే మతానికి, వేరే సంస్కృతికి చెందిందని భావిస్తారు. అదే వాళ్ళకు ఒక అడ్డంకిగా మారుతుంది. అందుకని వారికి అర్థమయ్యే భాషలో మన అనుభవానికి సంబంధించిన భాషలో మాట్లాడండి – నేను దానికి ప్రాధాన్యతనిస్తాను. ఇలా చెయ్యండి. అలా చెయ్యడం వలన మీరు వారి హృదయాలను, భావోద్వేగాలను, వారి అవసరాలను, వారిలో ఉన్న నిస్పృహభావాన్ని స్పృశించగలరు. మనం సంఘజీవులం, మనకు సామాజిక పరిచయాలు అవసరం. అందుకని మీకున్న అన్ని సామాజిక సంబంధాలను ఆధ్యాత్మిక సంబంధాలుగా మార్చుకోవడానికి ప్రయత్నించండి. మీ మార్గాన్ని వారితో పంచుకోండి!

**భక్తుడు** : కొన్నిసార్లు సత్సంగం సమయంలో ఇంటి దగ్గరే ఉండి బాబాతో ఒంటరిగా గడపాలనిపిస్తుంది.

**గురువుగారు :** నీకు నచ్చిన పద్ధతిని అనుసరించడానికి ఇరవై నాలుగు గంటలున్నాయి ! నీ స్వంత పద్ధతిని సత్సంగం జరిగే ఆ ఒకగంటలో మాత్రమే అనుసరించాలా? (గురువుగారు నవ్వుతూ..)ఏమిటా పద్ధతి? **ఆ పద్ధతి నిన్ను, నీ ఇష్టదైవం పట్ల ఇతరులు కురిపించే ప్రేమను అభినందించనీయకుండా, ఆస్వాదించనీయకుండా చేస్తోంది!**



నువ్వు సత్సంగంలో ఉండి నీ ప్రేమను అక్కడ వ్యక్తం చేయడాన్నే నేను ఇష్టపడతాను. ఎందుకంటే అందులో మనలాగే ప్రేమించే సాటి భక్తులమధ్య ఉండటమనే ప్రయోజనం ఉంది. మనం ప్రేమించే మన ఆరాధ్య దైవం అక్కడ ఎంతోమందితో ఆరాధింపబడుతున్నారు, అది కూడా మనకు ఆనందాన్నిస్తుంది. **అది మనకు సమస్యలా అనిపిస్తే మనలోనే ఏదో లోపం ఉంది.**

అంతమందితో ఉండటం అనుకూలంగా ఉంటుంది. అది మన మనస్సు మీద సత్ప్రభావాన్ని చూపుతుంది. సత్సంగంలో అదీ ఒక అంశం. మనం పదిమందితో కలిసున్నప్పుడు, అందరి ప్రేమ మధ్యలో ఉన్నప్పుడు మనకు తెలియకుండానే పొడిబారిన మన మనస్సులు చుట్టుప్రక్కలవారి ప్రేమ వల్ల ఆర్ద్రమవుతాయి. కొన్నిసార్లు మనలో ఎటువంటి అనుభూతి ఉండదు. మనం ఆ అనుభూతిని కోల్పోతాం. మనలోని ప్రేమోద్వేగం పొడిబారిపోతుంది. అప్పుడు మనకు ఆ (సత్సంగం)ప్రభావం అవసరమవుతుంది. మీరు ఆ ప్రభావానికి లోనై ఉండండి. దాని ఫలితాన్ని పొందండి. సంఘటితంగా ప్రేమను వ్యక్తం చేయడంలో ఉండే ప్రయోజనం అదే. అందుకే నేను దానిని ప్రోత్సహిస్తాను.

**భక్తుడు** : మా క్రొత్త సత్సంగంలో ఏం చేసుకుంటే బాగుంటుంది?

**గురువుగారు :** సరైన పద్ధతిలో బాబాను అంటి పెట్టుకోవడానికి మీరే మార్గాలను అన్వేషించుకోవాలి, ఊరకే అలా కూర్చుని కళ్ళు మూసుకోవడం మాత్రమే కాదు, కళ్ళు తెరచిన తరువాత మీరు ఎలా స్పందిస్తున్నారు. ప్రపంచంలో ఎలా వ్యవహరిస్తున్నారు,

బాబా పట్ల ఎలా ప్రతిస్పందిస్తున్నారు, సత్సంగం యొక్క మొత్తం ఉద్దేశ్యం గురించి ఎలా మాట్లాడుతున్నారు? వీటన్నింటి గురించి మీలో మీరు సరిచూసుకోండి, దానికి అనుగుణంగా పరిస్థితులను సరిచేసుకొండి.

సోమరితనంతో కూర్చోకుండా మీ పథంలో చురుకుగా అడుగులు వేయడానికి ప్రయత్నించండి, నడవండి, పరుగు తీయండి. మీ దగ్గర అంత సమయం లేదు – ఆ మాటకొస్తే మనందరికీ కూడా ! అందుకే ఊరకనే "ఇంకా చాలా సమయం ఉంది, మేము సాధించగలము " అని అనుకోకండి. అలా కాదు మీకు నిజంగా మీ లక్ష్యం చేరుకోవాలన్న ఆసక్తి ఉంటే, ఇప్పుడే పరుగుతీయండి ! లేకపోతే దాని గురించి, దీని గురించి ఉబుసుపోక మాట్లాడుకోవడంలో కాలం అలా గడచిపోతుంది.

మీ లక్ష్యం ఏమిటి, మీకు ఏం కావాలి, మీరు రోజంతా ఎలా గడుపుతున్నారు? రోజు మొత్తం 24 గంటలలో బాబా కోసం ఎంత సమయం మన జీవితాలలో వెచ్చిస్తున్నాం? మనం ఎంత సమయాన్ని బాబా తీసుకునేందుకు అనుమతించాం? దాని గురించి ఆలోచించండి. బాబా కోసం ఎక్కువ కిటికీలు తెరచి పెట్టుకోండి. బాబా కోసం ఎక్కువ మార్గాలను ఏర్పరచుకోండి, ఆయన లోపలకు రావడానికి



వీలుగా ఎన్నో మార్గాలను తయారుచేసుకోండి. అటువంటి సత్సంగాన్ని నేను ఇష్టపడతాను. అంతేగానీ ఏదో తంతులాగా, పద్మాసనం వేసుకుని కళ్ళు మూసుకుని మరో క్రొత్త భంగిమలో నిద్రపోయి వెళ్ళిపోవడం కాదు. అలా ఉండకూడదు. సత్సంగాన్ని చురుకుగా, ఉత్సాహంగా ఉండనివ్వండి.

ప్రతిరోజు డైరీ వ్రాసుకోండి, ఊరకే వ్రాసుకోవడం మాత్రమేకాదు – మళ్ళీ దానిని ఒక తంతులాగా మార్చకండి(గురువుగారు నవ్వుతూ..) మనం ఎంతమేరకు పురోగమించాం? మన లక్ష్యం నుండి, మన పథం నుండి మనల్ని దూరంచేసే పనులు ఏం చేశాం ? ఇలా మనసులో ఆలోచించుకోమని నా ఉద్దేశ్యం. విశ్రాంతిగా ఉండవద్దు! నేను చెబుతున్న దానిలోని సారాంశం ఇదే. విరామం తీసుకోవద్దు!

**గురువుగారు :** (హృషీకేశ్‌లో పడవ ప్రయాణం గురించి మాట్లాడుతూ...) నిజానికి, అక్కడ పడవలో ఉన్న వారందరూ నటిస్తున్నారు. చాలావరకు వారు వేస్తున్న తెడ్లు నీటిపైనే ఉన్నాయి! (నవ్వులు). కొంతమందైతే....(చాలా ప్రయాసతో తెడ్లు వేస్తున్నట్లు గురువుగారు నటించి చూపారు) (మరిన్ని నవ్వులు.) ఎక్కువ మంది ఉన్నప్పుడు తేలిక. (తెడ్లు వేయడం తేలికగా ఉంటుంది)

సత్సంగంలో కూడా ఇలాగే, మనలో భక్తిభావం చాలా బలహీనంగా ఉన్నప్పటికి, మిగతా వారి భక్తి మనలను అలా ముమ్ముందుకు తోసుకుని వెళుతుంది. నేను దానిని (తెడ్లు వేయడాన్ని) చూస్తున్నప్పుడు "ఓహో ఇదే కదా సత్సంగం" అనుకున్నాను (నవ్వులు).

వాస్తవంగా చూస్తే తెడ్లు వేయాల్సిన అవసరం కూడా లేదు. నదీ ప్రవాహమే మిమ్మల్ని తీసుకెళుతుంది. మీరు ప్రవాహానికి ఎదురు వెళ్ళడంలేదు. అవి నిశ్చలమైన నీళ్ళు కాదు, పడవ ఏదో ఒక వైపుకు కదలిపోతూనే ఉంది. మనం చెయ్యాల్సిందల్లా దానిని సరైన దిక్కుకు మళ్ళించడమే, పడవ నడిపే అతను ఎలాగూ ఆ పని చేస్తున్నాడు. అటువంటి గంగా నదీప్రవాహపు శక్తిలాంటిది బాబా మహిమ.

**భక్తుడు** : గురువుగారు, ఇంతకుముందు మీరు నిరంతరమూ సత్సంగమనే స్థితిలో ఉండటం గురించి మాట్లాడారు. ఆ స్థితి గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** మీకు ఆకలిగా ఉండి అన్నం తింటున్నప్పుడు, ఏ దశలో మీకు తృప్తి కలుగుతుంది? మొదటి ముద్దకు మీకు ఆకలి సంపూర్ణంగా తీరదు. మరి ఆకలి తీరనప్పుడు మీరు ఆ ముద్దను ఎందుకు తింటున్నారు? మొదటి ముద్ద రెండవ ముద్దకు, రెండవది మూడవదానికి, మూడవది నాలుగవదానికి దారితీస్తుంది. మీ కడుపు పూర్తిగా నిండినపుడు "ఇక చాలు!" అంటారు. ఆపై మీరు నెమ్మదించి మరిక ఆహారాన్ని తీసుకోరు. మీరప్పుడు ఆకలి గురించిగాని, ఆహరం గురించిగానీ అసలు ఆలోచించడం లేదు, కానీ మీకు ఆ తృప్తి అనుభవమవుతూఉంది. అప్పుడు మీరు విశ్రమించి ఓ కునుకుతీస్తారు.



నిజానికి అదీ మన లక్ష్యం. ఆ స్థితికి చేరుకోవడానికే మీకు ఆకలివేసింది. ఆహారం లభించింది. మీరు ఆహారాన్ని తిన్నారు. చివరగా మీకు ఆ స్థితి (కునుకుదీయడం) అనుభవమైనప్పుడు ఈ విషయాలేవి మీ మనస్సుకు రావు. దానికి ఆకలితో గాని, ఆహారంతోగానీ సంబంధం లేదు. అయినప్పటికీ, నిరంతరాయంగా తింటున్నప్పుడు ఎలా ఉంటుందో ఆ కునుకు అలా ఉంటుంది (గురువుగారు నవ్వుతూ...) ఇక్కడ మీరు ఒకటి, రెండు ముద్దలు తింటున్నారు. ఇది ఇలా కొనసాగుతూ ఉంటుంది. ఎప్పటివరకు ? మీకు సరిపోయేంతవరకు. అది మీకు సరిపోయినపుడు మీకిక సత్సంగం అవసరం లేదు, నేనూ అవసరం లేదు (గురువుగారు నవ్వుతూ...) ఆ స్థితిలో మీకు పళ్ళెం అవసరం లేదు, డైనింగ్ టేబుల్ అవసరం లేదు, హోటలూ అవసరం లేదు.

**గురువుగారు :** నేను ఎప్పుడు మీతోనే ఉన్నాను. మీరు కూడా ఇక్కడున్నప్పుడు నాతో ఉండటానికి (కనెక్ట్ కావడానికి ప్రయత్నించండి. (సరదాగా మాట్లాడుతూ...) మౌనంగా ఉన్నప్పుడు వారు నాతో కనెక్ట్ (అనుసంధానం) కావడానికి ఎక్కడో చూచాయగా అవకాశం ఉన్నట్లు నాకనిపిస్తుంది. (హాస్యంగా)

**భక్తుడు** : మనం ధ్యానానికి కూర్చున్నపుడు మనం మన మనస్సులోని అలజడిని గమనిస్తామని, అది మొదటి మెట్టని మీరు చెప్పారు. అలా అయినప్పుడు తర్వాత మెట్టు ఏమిటి!

**గురువుగారు :** అవి మెట్లు కాదు. నువ్వు వాటిని మెట్లే అని పిలవాలనుకుంటే - ఆ అలజడిని తొలగించుకోవాలన్న నీ పట్టుదల రెండో మెట్టు.

అలజడి ఉండటం ఒక విషయం.మనకు ఆ అలజడిని తొలగించుకోవాలన్న పట్టుదల కూడా ఉండాలి. బట్టలు మాసిపోయి ఉండవచ్చు, కానీ వాటిని ఉతుక్కోవాలన్న కోరిక మనకుండాలి. " బట్టలు బాగాలేవు అంతేకదా, దానిదేముంది, అంతగా పట్టించుకోవాల్సిన అవసరంలేదు. నాకు అలా వేసుకోవడమే ఇష్టం" అనుకుంటే, నువ్వు మొదటి మెట్టు మీదనే ఉంటావు. అందుకని సత్సంగం, బాబా నామం, బాబా ప్రేమ అనే సబ్బు వాడుకుని ఆ అలజడిని తొలగించుకోవాలన్న మీ పట్టుదలే రెండో మెట్టు. ఆ సబ్బు వాడుకుని శుభ్రం చేసుకోవడం మొదలుపెట్టండి.



## దిష్టిబొమ్మలు - ఫిబ్రవరి 2013

**భక్తుడు** : గురువుగారూ ! ఇంతకుముందు మీరు టి.ఎస్.ఇలియట్ రచించిన కవితలోని హాలోమెన్ గురించి మాట్లాడుతున్నపుడు డొల్లతనానికి, శూన్యానికి మధ్య తేడా నాకర్థం కాలేదు, ఆ కవితలో ఇలియట్ ప్రస్తావించిన ఆ డొల్లతనానికి (హాలోనెస్‌కి), బాబా అనుగ్రహం మనలో ప్రవేశించడానికి ఉండవలసిన ఖాళీకి మధ్య గలతేడా ఏమిటి?



**గురువుగారు :** ఖాళీగా ఉండటమంటే లోపలఏమీ లేకపోవడం, అక్కడ అనుకూలమైనదీ ఉండదు, ప్రతికూలమైనదీ ఉండదు. కనీసం మన గురించిన పరిమితమైన గుర్తింపు, మన వ్యక్తిత్వం గురించిన ఎరుక కూడా ఉండదు : ఒక విధమైన శూన్యం ఉంటుంది. నిజానికి అది మంచిది. టి.ఎస్. ఇలియట్ ప్రస్తావిస్తున్నది దాని గురించి కాదు. ఆయన గాంభీర్యత లేని డొల్లతనం గురించి మాట్లాడుతున్నారు. "మనం డొల్ల మనుషులం", అంటే మిడిమిడి జ్ఞానపు మాటలతో ఏదో మాట్లాడుతూ లోపలనిజమైనది ఏదీ లేకపోయినప్పటికీ మన అల్పమైన అహాన్ని సజీవంగా ఉంచుకోవడానికి ఏదో మాట్లాడుతూ, మరేదో చేస్తూ ఉండటం. అది డొల్లతనమంటే. దీనినే తరువాత పంక్తిలో ఆయన వివరిస్తాడు : " మనం (చెత్తతో ) దట్టంగా కూరబడిన మనుషులం", ఇటువంటి మనిషి పొలాలలో పక్షులను తరమడానికి పెట్టే దిష్టిబొమ్మ లాంటివాడు. ఆ దిష్టిబొమ్మ కోపంగా కనిపిస్తుంది కానీ దానికి ఎటువంటి భావావేశాలు ఉండవు. మనుషులు అటువంటి దిష్టిబొమ్మల్లాగా నటిస్తున్నారు అంటాడు ఇలియట్.

చాలా మంది ఎన్నో విషయాలతో నిండిపోయి ఉంటారు : రాజకీయాలు, వ్యర్థమైన వార్తలు, పనికిరాని సమాచారం వగైరాలతో నిండిపోయి ఉంటారు. మనం ఉదయాన్నే నిద్రలేవగానే ముందు వార్తలు తెలుసుకోవడానికి పేపరు చదవాలి, లేకపోతే టి.వి. పెట్టుకోవాలి. మనం ఎవరినైనా కలుసుకున్న తక్షణం మనం ప్రోగు చేసుకున్న వార్తావిశేషాలను ఎదుటివారు, ఎదుటివారు ప్రోగేసిన విశేషాలను మనం పరస్పరం మార్చుకోవడం మొదలుపెడతాం. వీడి చెత్తతో వాడిని నింపుతాడు, తిరిగి వాడి చెత్తతో వీడిని నింపుతాడు. చెత్తతో నిండిన మనుషుల వ్యవహారం ఇలా కొనసాగుతూ ఉంటుంది. (గురువుగారు నవ్వుతూ..) ఇదీ "చెత్తతో నిండిపోవడం" అంటే !

గురువుగారిని ప్రశ్నిస్తున్న భక్తుడు టి.ఎస్. ఇలియట్ రచించిన ప్రసిద్ధ కవిత "ద హాలోమెన్" (1925) గురించి మాట్లాడుతున్నారు. ఆంగ్ల సాహిత్యం పట్ల గురువు గారికి లోతైన పరిజ్ఞానంతో పాటు గాఢమైన మక్కువ ఉండేది. కాలేజి విద్యార్థిగా ఉన్నప్పుడు ఆంగ్ల సాహిత్యాన్ని ప్రత్యేకమైన అంశంగా ఎంచుకుని అందులో విశేషంగా రాణించారు.

**భక్తుడు** : మా శ్రద్ధను నిలుపుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచుకునే ప్రయత్నంలో ఎదురయ్యే అడ్డంకులను నేర్పుగా తొలగించుకోవడం ఎలా ? మన చుట్టూ అప్పటికే ఉన్న "చెత్తతో కూరబడ్డ" వాళ్ళ విషయంలో ఏం చెయ్యాలి?

**గురువుగారు :** డొల్లగానే ఉంటూ దానిని ఎదుర్కోకపోవడం ప్రమాదమని, నువ్వు డొల్లగా ఉన్నావని తెలుసుకోకపోవడం ఇంకా హానికరమనీ అర్థం చేసుకుంటే భయాన్ని పోగొట్టుకోవచ్చు. అయినా, నిన్ను నువ్వే ఎదుర్కొంటున్నావు. అదేదో భూతమో, మనకు తెలియనిదో కాదుకదా ! మనల్ని మనం చూసుకోవడానికి ఎందుకు భయపడాలి?



**భక్తుడు** : మనలో నిండిపోయిన ఆ చెత్తను పోగొట్టుకున్నప్పుడు ఆ నిజమైన శూన్యత ఏర్పడుతుందా?

**గురువుగారు :** అవును, ( గురువుగారు నవ్వుతూ..) ఈ చెత్త పోయినపుడు, ఆ ఖాళీ ఏర్పడటం జరుగుతుంది!

**గురువుగారు :** మీరు ధ్యానానికి కూర్చుని ఏదైనా లక్ష్యవస్తువు మీద మనస్సును లగ్నం చెయ్యాలని ప్రయత్నించినపుడు, అది బాబా కావచ్చు, శూన్యం కావచ్చు, రిక్తత కావచ్చు, బుద్ధత్వం, విపాసన.... ఇలా అది ఏదైనా కావచ్చు, మీరు ధ్యానానికి కూర్చున్న తక్షణం ఆలోచనలు వస్తాయి. ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి? ఆ ఆలోచనలకు కారణం ఏమిటి? ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయో గమనించండి. అప్పుడు మీ లోపలనిండిపోయి ఉన్న చెత్త, డొల్లతనం కనిపిస్తుంది. ఈ ఆలోచనలన్నీ లోపలపేరుకున్న చెత్త యొక్క పర్యవసానాలే.

**భక్తుడు** : ఎవరికైనా వారి లక్ష్యానికి సంబంధించిన విషయాలు కాకుండా మిగిలినవన్నీ నిష్ప్రయోజనమైనవేనా?

**గురువుగారు :** మరి కాదా ? మీకు ఇష్టమైన లక్ష్యమే అసలు కావాల్సిన విషయం. కాబట్టి మనల్ని వ్యర్థమైన విషయాలతో నింపుకోవడమంటే కావాల్సిన విషయం లేనట్టేగా ? (నవ్వులు)

**భక్తుడు** : మమ్మల్ని (మా అహాన్ని) మేము కోల్పోతామనే భయం కారణంగానే మాలోని శూన్యాన్ని వివిధరకాలవిషయాలతో నింపుకుంటున్నామా?

**గురువుగారు :** అవును, ఉన్నటువంటి కారణాలలో అదీ ఒకటి. కానీ సాధారణంగా అది మనల్ని మనం కోల్పోతామని భయపడే స్థాయికి చేరదు. ప్రధానంగా చాలామటుకు కేవలం అలవాటు మనతో ఆ పని చేయిస్తుంది. అప్రమేయంగా సాగిపోయే ఆలోచనలు, అలవాట్లు, ఆ అలవాట్లకుండే బలం.... ఇటువంటి పైపైన ఉండే వాటివల్లనే ఇలా (నింపుకోవడం) జరుగుతుంది. మీరు ఇంకా లోతుగా వెళ్లి నిజంగా ఆ శూన్యాన్ని అనుభవించినప్పుడు మిమ్మల్ని మీరు కోల్పోవడమనే భయం కలుగుతుంది. సాధారణంగా ఆలోచనలు అలా వస్తూ ఉంటాయి. మీరు ఆలోచించడం కాదు-ఆలోచనలు అలా సాగిపోతూ ఉంటాయి.

**భక్తుడు :** గురువు గారు ! ఎవరైనా వాళ్ళ ఆలోచనలను, అలవాట్ల క్రమాన్ని (ప్యాట్రన్స్‌ను) తెలుసుకోగలిగితే, దాని నుండి బయటపడటానికి మార్గమేదైనా ఉందా?

**గురువుగారు :** అటువంటి ఆలోచనలను పట్టించుకోకపోవడం ఒక పద్ధతి. ఆ ఆలోచనలు మీ గమనింపుకు వచ్చిన తక్షణం వాటిని వదిలేయండి. “ నేను ఏమాలోచిస్తున్నాను, ఆ ఆలోచన ఎందుకు వచ్చింది” అని వాటి గురించి ఆలోచించ వద్దు. కనీసం ఆ మాత్రం పట్టించు కోవాల్సిన అర్హత కూడా వాటికి లేదు !



వాటిని పట్టించుకోకుండా మీ లక్ష్యం మీద దృష్టి పెట్టండి. "ఉన్నట్టుండి నాకు నా కుటుంబం గురించిన ఆలోచనలు వస్తున్నాయి! నేను ఆ ఆలోచనలను తప్పక గమనించాలేమో?" అని అనుకోకుండా వాటిని అక్కడతో ఆపివేస్తే అవి పోతాయి. మరుసటిరోజు ఆ ఆలోచనలు కనిపించవు, వేరే రకమైనవి వస్తాయి. వాటినీ పట్టించుకోకండి! మీ లక్ష్యాన్ని మనస్సులోనికి తెచ్చుకుంటూ ఉండండి. అలా పట్టించుకోకుండా ఉండటమే అసలు కీలకమైన విషయం. మీరు వాటిని విశ్లేషించడం మొదలుపెడితే అలా విశ్లేషించడమనే మరొక అలవాటు (ప్యాట్రన్) మొదలవుతుంది. ఈ విశ్లేషణ పేరు మీద పగటి కలలు కంటూ, వాటి చుట్టూ తిరుగుతూ అలా ఆలోచించుకుంటూ ఉండిపోతారు. (గురువుగారు నవ్వుతూ..)

మీరు కావాలనుకున్న ఆ ధ్యానవస్తువు గురించి కాకుండా మరే ఇతర ఆలోచనలనైనా – అవి మంచి ఆలోచనలైనా సరే – వాటిని పట్టించుకోవద్దు. మనస్సును మీ లక్ష్యవస్తువు మీదనే పెట్టండి, కాసేపటి తరువాత ఆ ఆలోచనలు విసిగిపోయి మరి రావు. అదీ ఒక విధమైన ఆలోచనా క్రమమే (ప్యాట్రన్). అందుకని ఒక్కసారి ఆ ఆలోచనాక్రమం తెగిపోయాక అటుపై ఆలోచనలు రావు.

**భక్తుడు :** ఆ ఆలోచనా క్రమం (ప్యాట్రన్) ఏమిటి ? అలా ఫలానా విధంగా ఆలోచించడమనే ఆలవాటు (ప్యాట్రన్) అని మీ ఉద్దేశ్యమా?

**గురువుగారు :** అవును, ఆ విధంగా ఆలోచించడమనే అలవాటు. సాధారణంగా దానిని గమనించడం చాలా కష్టం. మీ రోజువారీ దినచర్యలను వ్రాసుకోగలిగితే రకరకాలఆలోచనలు నిర్ణీత సమయాలలో పునరావృతమవుతుంటాయి అని తెలుస్తుంది. అవి వేరే వేరే విషయాలగురించిన ఆలోచనలు కావచ్చు, వ్యతిరిక్తమైన ఆలోచనలు కావచ్చు. తల్లి గురించి లేదా తండ్రి గురించి లేదా ఉద్యోగం గురించి కావచ్చు. మీ దినచర్యను విపులంగా వ్రాసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు కొన్ని రకాల ఆలోచనలు ఒక క్రమబద్ధమైన రీతిలో మళ్ళీ మళ్ళీ వస్తుండటాన్ని మీరు గమనిస్తారు. ప్రతిరోజు మీ ఆలోచనలు, వాటి సరళి ఎలా ఉందో వ్రాసుకుని చూడండి. ఒక నిర్దిష్టమైన క్రమత ఉంటుంది, ఆలోచనలలోని విషయం కొద్దిగా మారవచ్చుగానీ ఆలోచనా క్రమం అలాగే ఉంటుంది.

**భక్తుడు :** అప్రమేయంగా పునరావృతమయ్యే ఆలోచనలు (ప్యాట్రన్స్), వాసనలు (హాబిట్ ఎనర్జీ) రెండు ఒకటేనా ?

**గురువుగారు :** అవి రెండూ ఒక్కటే, నేను దానిని ప్రమేయంలేని ఆలోచన క్రమం (ప్యాట్రన్) అంటాను, వేదాంతంలో వాళ్ళు దానినే 'వాసన'అన్నారు.

**భక్తుడు :** అంటే దానర్థం (ప్యాట్రన్స్) కొంతకాలంగా మళ్ళీ మళ్ళీ చేస్తూ ఉన్న పని అనుకోవచ్చా?



**గురువుగారు :** అవును, మళ్ళీ మళ్ళీ చేస్తూ ఉండటం, దానివల్ల అవి (ప్యాట్రన్స్) మరింత బలంగా తయారవుతాయి.

**భక్తుడు** : అసలది ఎలా ప్రారంభమవుతుంది? ప్రతి ఆలోచనాక్రమానికి (ప్యాట్రన్స్) మొదలంటూ ఉండాలి కదా, తరువాతే మనం దానిని తిరిగి చేస్తాం.

**గురువుగారు :** ఈ విషయాలపట్ల నీ ఎరుక లేనప్పుడే ఇవి మొదలవుతాయి, నీకు ఆకలిగా ఉన్నప్పుడు, నువ్వు పాలకోసం ఏడుస్తు అమ్మ కోసం చూస్తున్నప్పుడు మొదలై ఉంటాయి. మన మనస్సు ఆలోచించడం మొదలుపెట్టినప్పటి నుండి.. రెండు, మూడు, వేలు, లక్షలు, కోట్ల ఆలోచనాక్రమాలు (ప్యాట్రన్స్)..ఇలా వృద్ధి చెందుతూ పోతాయి.

**భక్తుడు** : ఇలా అలవాటుగా వచ్చే ఆలోచనలను అధిగమించడానికి వాటిని పట్టించుకోకుండా ఉండటమే మంచి మార్గమని మీరు అంటున్నారు కదా?

**గురువుగారు :** అవును, పట్టించుకోవద్దు ! విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాలలో వివిధ పద్ధతులున్నాయి. నామాన్ని లేదా మంత్రాన్ని లేదా శబ్దాన్ని తిరిగి తిరిగి ఉచ్చరించడం ఈ ప్రమేయంలేని ఆలోచనాక్రమాన్ని (ప్యాట్రన్స్‌ను) అధిగమించడానికి ప్రధానమైన పద్ధతి– దానిని నువ్వు జపమను, మరేదైనా అను. అసలు మంత్రసాధనంతా తెంపులేని మన ఆలోచనాక్రమాన్ని విచ్ఛేదం చేయడం కొరకే.

**భక్తుడు** : కానీ బాబా మనకు ఏ మంత్రాన్నీ చెప్పలేదు కదా?

**గురువుగారు :** ఆ అవసరం లేదు. ఆయన పద్ధతి వేరుగా ఉంటుంది.

ఏ విధమైన సాధన (సాధనం) అవసరం లేకుండానే బాబా మన ఆలోచనలు మరియు అలవాట్ల క్రమాన్ని ఛేదిస్తారు, అది అంతటితో పోతుంది! ఒకానొక క్షణంలో – అది సత్సంగం కానివ్వండి, లేదా మీరలా ఊరకే పర్వతాలను లేదా గంగానదిని చూస్తున్నప్పుడు కావచ్చు, అదే గంగను మీరు ఇంతకుముందు వెయ్యిసార్లు చూసుంటారు, అదే ప్రాంతానికి వెయ్యిసార్లు వెళ్ళుంటారు, కానీ హఠాత్తుగా మనకు ఏదో జరుగుతుంది, ఉన్నట్టుండి ఒక ఆలోచనా చక్రం తునాతునకలైపోతుంది, ఊరకనే అలా! అప్పుడు నువ్వు అంతకుముందు మనిషివి కాదని నీకు తెలుస్తుంది, నువ్వు ఆలోచించే విధానం మారుతుంది. ఏం జరిగిందో మనకు తెలియదు, కానీ మనలో ఏదో మారినట్టు మనకు తెలుస్తుంది. దేనినో అలా తీసేసినట్లనిపిస్తుంది, మరేదో లోనికి వచ్చినట్టనిపిస్తుంది, మనకు మనమే క్రొత్తగా అనిపిస్తుంది, ప్రపంచం క్రొత్తగా అనిపిస్తుంది, మార్గం క్రొత్తగా అనిపిస్తుంది, అప్పటివరకు ఉన్న అదే పాత మిత్రులను క్రొత్తగా చూడటం మొదలుపెడతాం. అది బాబా చెయ్యగలరు.



**భక్తుడు :** గురువుగారు, శూన్యమనే ఆ మంచి అనుభవానికి, మనోవాసనలు లేదా అలవాట్లకు (ప్యాట్రన్) గల సంబంధమేమిటి?

**గురువుగారు :** అలవాటుగా చేసే పనుల నుంచి, ఆలోచనలనుంచి విముక్తి పొందిన తరువాత నీకు ఆ ఖాళీ, నిరామయమైన స్థితి అనుభూతమవుతుంది. నిన్ను డొల్లగా చేసేది, దిష్టబొమ్మలా చేసేది ఇలా అసంకల్పితంగా సాగిపోయే అలవాట్లు, ఆలోచనలే. ముందు మనం అసలు విషయాన్ని మనలో నింపుకోవాలి. అప్పుడు మనలో ఉన్న డొల్లతనం నెమ్మదిగా తొలగిపోతుంది.

దీనిని అనుభవరూపంలో పొందడానికి రెండు మార్గాలున్నాయి : బుద్ధుని మార్గమొకటి, వేదమార్గమొకటి. బుద్ధుడు ఆ శూన్యాన్ని ప్రత్యక్షంగా అనుభవంలోనికి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆయన దీనినంతా కేవలం డొల్లతనంగా చూశాడు. ఇది వాస్తవం కాదని, కాబట్టి దానినుండి బయటపడమని చెప్పాడు. కానీ నువ్వు అలా చేయగలవా? నీవు కూర్చుని ఉన్న కొమ్మ అది. నువ్వు కూర్చున్న కొమ్మను నువ్వు ఎలా నరుక్కోగలవు! కాబట్టి మరొక మార్గమేమిటంటే నిజమైన దానిని – ఏదైనా అసలు మనకు నిజంగా కావలసిన విషయాన్ని – మన మనస్సులో ఉంచుకోవడానికి ప్రయత్నించడం, తద్వారా నెమ్మదిగా మనం దానితో నిండిపోయి చివరకు దానిని కూడా పోగొట్టుకోగలం. నిజానికి శూన్యమే పూర్ణం, పూర్ణమే శూన్యం. సంస్కృతార్థాలను తీసుకుంటే రెండు ఒకే దగ్గరకు వస్తాయి. **శూన్యమన్నా, పూర్ణమన్నా సున్నానే, ఇంకా సున్నా అంటే అనంతపూర్ణత్వం!** అందువలన బుద్ధుడు శూన్యమని పిలిచినదానినే హిందు సాంప్రదాయంలో పూర్ణత్వం అన్నారు. పూర్ణం, శూన్యం రెండూ ఒకటే, కానీ సృష్టి అస్తిత్వాన్ని ఒక్కొక్కరు ఒక్కోరకంగా చూస్తారు. వారు ప్రయత్నించే మార్గం, అనుసరించే ప్రక్రియ వేర్వేరుగా ఉంటాయి.

సాధారణంగా మన మనస్సులను చాలా విషయాలతో నింపుతూ ఉంటాం. నిద్రలేవగానే ముందు మనం "వాతావరణం ఎలా ఉంది? ఈ రోజు చాలా చలిగా ఉంది, సూర్యుడు చాలా అందంగా ఉన్నాడు" ఇలాంటి వాటి గురించి మాట్లాడుతాం. ఫోన్ తీయగానే, " ఈ రోజు చాలా చల్లగా ఉంది, తేమగా ఉంది, తడిగా ఉంది, పొడిగా ఉంది...నిన్న అలా ఉంది, ఈ రోజు వాతావరణ సూచన ఇలా ఉంది" అనడమో, లేదా "ఆ సినిమా ఎలా ఉంది? "ఉత్తరాంచల్ ప్రభుత్వం ఎలా ఉంది? (గురువుగారు నవ్వుతూ.) ఇదేంటి, అదేమిటి..? అని ఇలాంటి విషయాలన్నీ అడుగుతుంటాం. ఇవంతా వ్యర్ధవిషయాలే.

'ద స్పెక్టేటర్'* పత్రిక మొదటి సంచికలో దాని సంపాదకుడు ఎడిసన్, తను ఆ పత్రికను ఎందుకు ప్రారంభిస్తున్నాడో వ్రాశాడు. ఆయన చెప్పిన కారణాలలో ఒకటేమిటంటే : "ఇటువంటి డొల్లమనుషులకు, చెత్తను దరి చేర్చుకునే మనుషులకు ఆలోచించడానికి కాస్త అర్ధవంతమైన విషయాలను ఇవ్వడంద్వారా, వారి ఖాళీ బుర్రను నింపుకోవడానికి కాస్త ఉపయోగపడే విషయాలను ఇస్తున్నాను " నేను వాళ్ళకు కాస్త



మంచి విషయాలు ఇవ్వాలనుకుంటున్నాను, వాళ్ళు నిద్రలేవగానే వారి మంచం ప్రక్కన 'ద స్పెక్టేటర్' ఉంటుంది. తమకుగానీ లేదా సమాజానికిగానీ కాస్త ఉపయోగకరమైన విషయాలగురించి ఆలోచించిడానికి అది వారికి అవకాశం కలిగిస్తుంది" అని అన్నాడు నేను దానిని ఇష్టపడతాను.

**భక్తుడు :** (హాస్యంగా..) సత్సంగంలో మేము పొందే వాటిల్లో అది కూడా (ఉపయుక్తమైన విషయాలను మాకు అందివ్వడం) ఒకటా?

**గురువుగారు :** కావచ్చు - అందుకనే మీరు మాట్లాడుకోవడానికి, మీ లక్ష్యసాధనలో అర్థవంతంగా, ఉపయుక్తంగా ఉండి, మిమ్మల్ని మీ లక్ష్యం మీద దృష్టిపెట్టేలా చేసే కొన్ని విషయాలుంటాయి. మీరు వాటి గురించి మాట్లాడుతున్నారో లేదోనన్న విషయం నాకు తెలియదు, కానీ నేను మాత్రం ప్రయత్నిస్తాను, లేకపోతే అర్థరహితమైన ఆలోచనలు వస్తూనే ఉంటాయి.

మీరు వార్తాపత్రికలు చదవడం ఎందుకు? మీరు వ్యాపారస్తులై ఉండి మీకు సమాచారం నిజంగా అవసరమైతేనో, ఏదైనా వ్యవహారానికి సంబంధించినదైతేనో దానికి అర్థముంటుంది. ప్రాపంచికం కానివ్వండి లేదా ఆధ్యాత్మికం కానివ్వండి- అదేదైనా సరే - మీకు ప్రత్యక్షంగా కానీ, కనీసం పరోక్షంగా కానీ మీ జీవితానికి, మీ గమ్యానికి, లక్ష్యానికి ఎటువంటి సంబంధం లేని విషయాలతో మిమ్మల్ని మీరు నింపుకోవడం మానండి, అదో వ్యసనం. మనకు సంబంధం లేని ఎన్నో విషయాలను మనం చేస్తుంటాం. మీకుగానీ లేదా ఎదుటివ్యక్తికిగానీ ఉపయోగం లేని మాటలను మాట్లాడుకోకుండా ఉండటం అనే నియమాన్ని పెట్టుకోండి. మీరు ఎప్పుడు ఏం మాట్లాడినా అది మీకుగానీ, మరొకరికిగానీ ఉపయోగపడాలి. మీ ఇద్దరికీ ఉపయోగపడనిది ఏదైనా అది చెత్తతో నింపుకోవడమే.

మీరు మాట్లాడే మాటలన్నింటినీ గమనించండి. మిమ్మల్నీ, ప్రక్కన వాళ్ళనూ ఎంతగా చెత్తతో నింపుతున్నారో తెలుస్తుంది. మనం మాట్లాడే చాలా మాటలు చాలావరకు చెత్తతో నింపుకోవడమే. మీరు పరిశీలించుకోండి, మీకే తెలుస్తుంది! అప్పుడు మీరు అర్థవంతమైన సాంగత్యంలో ఉంటారు. అలా అయినప్పుడు మీ జీవితమంతా అర్థవంతంగా ఉంటుంది.

*'ద స్పెక్టేటర్' దినపత్రిక 1711లో లండన్ నగరంలో జోసెఫ్ ఎడిసన్, రిచర్డ్ స్టీల్‌లచేత స్థాపించబడింది. ఈ పత్రిక 18 నెలలపాటు ప్రభావశీలంగా, ప్రజాదరణతో నడిచింది. తరువాత 1824లో ఒక రాజకీయ సాంస్కృతిక వారపత్రిక ఆవిష్కరణకు ఈ పేరును వాడుకోవడం జరిగింది. ఈ వారపత్రిక ఇప్పటికీ సమకాలిన బ్రిటీష్ వార్తాపత్రికలలో ప్రముఖ పాత్రను పోషిస్తోంది.

## బాబాకు పగ్గాలప్పగించడం ఎలా? - మార్చి 2013





**గురువుగారు :** "నీ జీవితమనే రథం యొక్క పగ్గాలు సద్గురువుకు అప్పగించి నిశ్చింతగా ఉండు, ఆనందంగా ఉండు" – ఇదీ బాబా చెప్పింది. కానీ మనం పగ్గాలు బాబాకు అప్పగించలేకపోతున్నాం. ఒకవేళ అప్పగించినా, మళ్లీ మనం కూడా చూసుకుంటూనే ఉంటాము. మీరు కారులో రాత్రిపూట ప్రయాణిస్తున్నారు. మీకు డ్రైవర్‌మీద నమ్మకం లేదు అనుకుందాం. ఇక మీరు నిద్రపోలేరు. అతను సరిగ్గా నడుపుతున్నాడా, లేదా? అతడు గేర్లు సరిగా మారుస్తున్నాడా, లైట్లు సరిగా వాడుతున్నాడా? అని ప్రతిక్షణం చూసుకుంటూనే ఉంటారు. "జాగ్రత్త, జాగ్రత్త! ఎడమప్రక్కకు పోనివ్వు, అక్కడ కుడిప్రక్కకు పోనివ్వు" అంటూ మీరు డ్రైవరును వెనుకసీటు నుండి కంట్రోల్ చేస్తుంటారు. ఎందుకంటే మీరు నిజంగా అతడిని నమ్మడం లేదు.

అందుకనే మనం అంత సులభంగా మన జీవితపు పగ్గాలు అప్పగించలేము అనేది అసలు నిజం. అలా అప్పగించాలంటే మనకు నిజమైన నమ్మకాన్ని కలిగించే ఏదైనా అనుభవం ఉండి ఉండాలి, ఆ డ్రైవర్ ఎంత సమర్థుడో తెలియాలి. దానికోసం ముందు నమ్మకస్తుడైన డ్రైవరును చూసుకోవాలి. అప్పుడు అతనికి బాధ్యతను అప్పగించి, అతను ఎలా పనిచేస్తున్నాడు, మిగిలిన విషయాలను ఎలా నిర్వర్తిస్తున్నాడో చూడాలి. నేను దీనిని మళ్లీ మళ్లీ ఎందుకు చెబుతున్నానంటే మన మౌలిక సమస్య అజ్ఞానం కాదు, అసహాయత. దేనినో తెలుసుకోవాలని అనుకోవడం కాదు. అది మీలో ఎవరినైనా నిజంగా బాధిస్తోందా? (గురువుగారు నవ్వుతూ..) మనల్ని ప్రాథమికంగా బాధించేది మన అసహాయత. మనకు అనుభవమయ్యేది ఆ అసహాయతే. మనకు సహాయం చేసే వ్యక్తికి మన జీవితాన్ని, చుట్టుప్రక్కల వాతావరణాన్ని, మన ప్రాపంచిక పరిస్థితులను మొత్తంగా మన జీవితాన్నంతా నడిపించగల శక్తి, జ్ఞానం రెండూ ఉండాలి. అంతేగాని ఊరికే ప్రవచనాలు, ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. ఆయనకు ఆ శక్తి, దానితో సమ్మిళితమైన జ్ఞానం రెండూ ఉండాలి.

**భక్తుడు :** డ్రైవరుకు (సద్గురువుకు) పగ్గాలు అప్పగించడం ద్వారా నిజంగా అనుగ్రహం పొందగలమంటారా?

**గురువుగారు :** అవును, ఎందుకంటే అప్పుడు మీరు డ్రైవరు (సద్గురువు) **శక్తిసామర్థ్యాలను ఉపయోగపెట్టుకోగలుగుతారు.** ఆ విధంగా మీరు ఆయన శక్తిని అనుభవించగలుగుతారు.

**భక్తుడు :** మన అసహాయతను గుర్తించిన క్షణంలో ఆ అనుగ్రహాన్ని అనుభూతి చెందుతామా?

**గురువుగారు :** నిజానికి నీకు ఆ గుర్తింపు కలిగినపుడే నువ్వు అసహాయుడవు అని కాదు. మిగతా సందర్భాలలో కూడా నువ్వు అసహాయంగానే ఉంటావు, బహుశా ఒక సందర్భంలో కంటే ఇంకో సందర్భంలో



నువ్వు ఆ అసహాయతను కాస్త ఎక్కువగా గుర్తించగలుగుతావు. మనం మన అసహాయతను ఎంతగా గుర్తిస్తామో, అంతగా మనం సహాయం కోసం, అనుగ్రహం కోసం అన్వేషిస్తాం. ఆ అసహాయస్థితిని మనం ఎంతగా గుర్తిస్తామో, అంతగా మనం అసహాయులం అనే భావన మనకు కలగడం లేదు. అదీ సమస్య. జబ్బు బాగా ముదిరిపోవడం వలన అదే మనకు సహజస్థితిలాగా, ఆరోగ్యకరస్థితిలాగా అనిపిస్తుంది.

ఉదాహరణకు, బొంబాయి లాంటి నగరంలో పుట్టి పెరిగిన ఓ వ్యక్తి ఉన్నాడనుకుందాం. అతనికి దూరాన గ్రామంలో ఉన్న బంధువుల నుండి ఒక పెళ్లికి ఆహ్వానమందింది. సుమారు ఇరవై, ఇరవై అయిదు సంవత్సరాలు నగరంలో జీవనం సాగించి, అతని జీవితంలో మొదటిసారి బొంబాయిని వదలి దూరాన ఉన్న పల్లెటూర్లో పెళ్లికి హాజరవుతాడు. పెళ్లి అయిపోయిన తరువాత అక్కడి పొలాలలో ఆహ్లాదకరమైన స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ నడుస్తూ ఉంటాడు. కానీ అతనికి ఏదో వింత వాసన వస్తున్నట్లుగా – ఏదో క్రొత్తగా, తేడాగా అనిపిస్తుంది. ఆ దారిన పోతున్న ఒక రైతును, "ఏంటీ ఈ వింత వాసన ఇక్కడ" అని అడుగుతాడు. దానికి రైతు "పరిశుభ్రమైన స్వచ్ఛమైన గాలి" అని సమాధానమిస్తాడు. (గురువుగారు నవ్వుతూ..)

**గురువుగారు :** "నాకు పగ్గాలప్పగించండి, నేను మిమ్మల్ని మీ గమ్యానికి చేరుస్తాను" అన్నారు బాబా. మీ జీవితాన్ని నియంత్రించడం ఎలాగో మీకు తెలియదు. అందుకని ఆ సామర్థ్యం ఉన్నవారికి, దానిని సరిగ్గా నడపడం తెలిసిన వారికి ఆ బాధ్యతను అప్పగించండి. **ఆయన మిమ్మల్ని వారి గమ్యానికి చేర్చడం కాదు, మిమ్మల్ని మీ గమ్యానికి చేర్చాలి. అదే బాబా చెప్పింది. "నేను మిమ్మల్ని మీ గమ్యం చేరుస్తాను"** అని. ఆ గమ్యం ఏదైనా సరే.

**భక్తుడు :** పగ్గాలు అప్పగించడం ఎందుకంత కష్టమవుతోంది? ఒకే వ్యక్తికి ఒక ప్రక్క పగ్గాలు అప్పగించాలని, మరోవైపు అప్పగించకూడదని, రెండు రకాల భావనలు ఉంటాయేమో అనిపిస్తోంది. నేను ఆ విభజనను (నాలో) గుర్తించగలుగుతున్నాను. ఈ విషయంలో ఏమిటి చేయడం?

**గురువుగారు :** నిజమే, అది కష్టం, చాలా కష్టం. ముఖ్యంగా నీ జీవితం మీద నీకు నియంత్రణలేదని, జీవితాన్ని నువ్వు నియంత్రించలేవని ఇంకా ఇంకా తెలుసుకోవాలి. జీవితం మీద మనకు నియంత్రణ ఉంది అని మనం అనుకున్నపుడు, ఇక మనవల్ల కాదని పూర్తిగా వదిలిపెట్టే పరిస్థితి తలెత్తేవరకు మనం ప్రయత్నిస్తూనే ఉండాలి.

**భక్తుడు :** కాని మాకు వదులుకోవాలని ఉన్నట్టు కనిపించదు.

**గురువుగారు :** అలా అయితే వదిలిపెట్టవద్దు (గురువుగారు నవ్వుతూ...) అయినా వదిలిపెట్టమని మిమ్మల్ని



ఎవరూ బలవంత పెట్టడం లేదు. ఎవ్వరైనా వారు కోరుకున్నంత మాత్రాన వదిలిపెట్టలేరు. ఎందుకంటే అది వాళ్లవల్ల కాదు. వదిలిపెట్టాల్సిన పరిస్థితి వచ్చినపుడు వారికి వేరే అవకాశం ఉండదు.

**భక్తుడు :** మా జీవితాన్ని మా నియంత్రణలో పెట్టుకోవడంలో మేము విఫలమవుతున్నప్పటికీ ఏదో రకంగా నిస్సహాయంగా ప్రయత్నిస్తూనే ఉంటాం.

**గురువుగారు :** ఈ ప్రపంచంలో కోట్లాదిమంది ప్రజలు ప్రతిక్షణం అసహాయంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు – మీరు (సద్గురువు యొక్క) సహాయం తీసుకొని ప్రయత్నించండి అంటున్నాను. అదే అక్కడున్న ఒకే వ్యత్యాసం.

**భక్తుడు :** గురువుగారూ! మాకు అవసరం ఉన్నప్పటికీ మేము సహాయం కోసం అర్థించడం జరగదు ఎందుకని? ఇది చాలా మూర్ఖత్వంలా అనిపిస్తుంది.

**గురువుగారు :** ఎందుకంటే, మీకలా నేర్పారు, ముఖ్యంగా పాశ్యాత్య దేశాలలో – "సాయంకోసం చూడవద్దు, స్వతంత్రంగా ఉండండి, మీకు మీరు సహాయం చేసుకోండి, మీరు అలా ఉండండి, ఇలా ఉండండి, మీ నిర్ణయాలు మీరే తీసుకోండి, పట్టుదలతో ఉండండి, దృఢసంకల్పంతో ఉండండి, మీరు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండండి"... ఈ రకంగా చెప్తారు. ఇటువంటి విషయాలు నర్సరీ స్కూలు స్థాయి నుండి మీకు బోధింపబడ్డాయి, అందుకనే ఇది బాగా తెలిసిన విషయంలా ఉంటుంది. సహాయాన్ని కోరడం మనకు తెలియని విషయం, అదీ సమస్య. సహాయం కోసం అన్వేషించడం అనే పద్ధతిని మీరు అలవాటు చేసుకోవాలి.

**భక్తుడు :** ఎవరికైనా "నాకు తెలియదు" అని ఒప్పుకోవడం చాలా కష్టమైన విషయం.

**గురువుగారు :** అవును, ఎవరికైనా వారి నిస్సహాయతను అంగీకరించడం చాలా కష్టమైన విషయం. అందుకనే ఎంచుకోవడం అనే అంశం ఎప్పుడూ వస్తుంటుంది. "మన సద్గురువును మనం ఎన్నుకోవాలి, మనమే ఆయనను ఎన్నుకున్నాం, ఆ ఎంపిక మనదే" ఇలాంటివి. ఈ విషయంలో కూడా మన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలని అనుకుంటాము. సద్గురువును ఎంచుకోవడం వరకైనా మనకు మనం సహాయం చేసుకోవాలని అనుకుంటాము. కానీ నేను చెప్పేది ఏమిటంటే, సద్గురువును ఎంచుకోవడమనే ఈ విషయంలో కూడా నువ్వు నిస్సహాయస్థితిలోనే ఉన్నావు. నిజానికి చూస్తే నువ్వే సద్గురువుచే ఎన్నుకోబడ్డావు.

**భక్తుడు :** మీ అనుభవం కూడా అదేనా గురువుగారూ?

**గురువుగారు :** అవును. నేను బాబాను ఎంపిక చేసుకోలేదు. అలా బాబాను కాకుండా మరో రకంగా ఎన్నుకోలేక పోయాను. అంతే. నేను ఆయనను ఎన్నుకున్నాను అని ఏనాడూ అనుకున్నట్టు నాకు గుర్తులేదు.



**భక్తుడు :** పరివర్తన చెందడం అంటే నేను చేయలేని చాలా విషయాలను గురించి ఒక్కొక్కటిగా మరింత తెలుసుకోవడం అనిపిస్తోంది.

**గురువుగారు :** మీరు చేయలేని (మీకు వల్లగాని) విషయాలను గురించి మీరు ఎంతగా తెలుసుకుంటారో అంతమేరకు మీరు నిజంగా నిస్సహాయంగా మారతారు. అపుడు మీరు ఎంతగా సహాయం కోసం అన్వేషిస్తారో అంత సహాయం అందుతుంది. అప్పుడు మీరు దానిని ఆస్వాదిస్తారు. అనుభూతి చెందుతారు. అక్కడ మూడు విషయాలున్నాయి. సహాయం కోసం చూడటం, సహాయాన్ని పొందడం, దానిని పొందినపుడు దాని విలువను గుర్తించి ఆస్వాదించడం. చాలామంది విషయంలో నేను గమనించింది ఏమిటంటే, నేను వారిని కృతజ్ఞతలేని వారు అని అనను కానీ, వారు కోరుకున్న సహాయాన్ని పొందినపుడు దాని విలువను గుర్తించి ఆస్వాదించే సామర్థ్యం వారికి ఉండదు.

**గురువుగారు :** సహాయం కోసం నిజాయితీగా, నిష్కపటంగా, హృదయపూర్వకంగా అడగండి. అడిగిన తరువాత సద్గురువును ఆయన పద్ధతిలో సహాయం చేయనివ్వండి. “నాకు ఈ పద్ధతిలోనే చెయ్యండి. ఆ విధంగా చెయ్యవద్దు!” అని నిర్బంధించవద్దు. (నవ్వులు...) మీరు నిజంగా సహాయాన్ని ఆశిస్తున్నట్లయితే ఎలా సహాయం చెయ్యాలో ఆయనకు తెలుసు అనే విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మనం అడగడం అనేది బేషరతుగా ఉన్నప్పుడే అది నిజంగా సహాయం కోసం అర్థించడం అవుతుంది. మీకు సహాయం చేసేవారు (సద్గురువు) అవ్యాజ ప్రేమతో సహాయం చేస్తున్నారు. కాబట్టి ఆయనను మీరు అవ్యాజంగా సహాయం చేయనివ్వండి. ఆయనకుగాని, ఆయన చేసే సహాయానికిగాని షరతులు పెట్టవద్దు. మీరే కాదు, అందరూ చేసేది అదే, చాలామంది అలానే చేస్తారు.

అందుకనే క్రితం సత్సంగంలో ఈ సందిగ్ధత గురించి, పరస్పర విరుద్ధత గురించి (మనలోని) అవరోధాన్ని గురించి చెప్పాను– ఒకప్రక్క మనకేమో సహాయం కావాలి, దాని కోసమే మన ఏడుపంతా అని అనుకుంటూ ఉంటాం. కానీ అడగడానికి ఏదో అడ్డుపడుతూ ఉంటుంది. నేను చెప్పేదేమిటంటే సహాయం కోసం ఏడుస్తున్నారు బాగానే ఉంది, కానీ సహాయం అందించినపుడు దానిని తీసుకోండి! మీకు సహాయం చేసే ఆ చెయ్యి మీ నుండి ఏమీ ఆశించడం లేదు. కేవలం ప్రేమతో, అవ్యాజంగా మీకు సహాయం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. దానిని గుర్తించండి. ఆయనకు వేరే ఉద్దేశ్యాలు ఆపాదించకండి. “ఆయన నాకు ఎందుకు సహాయం చేస్తున్నాడు? కారణం ఏమిటి? నేను ఆయన స్థానంలో ఉంటే నేను చేసేవాడిని కాదు, మరి ఆయనెందుకు చేస్తున్నాడు? ఏదో విషయం ఉండాలి. నేను ఆ సహాయం తీసుకోకుండా ఆగితేనే మంచిదేమో. ముందు ఆయన ఎందుకు సహాయం చేస్తున్నారో నన్ను తెలుసుకోనివ్వండి. అప్పుడు నేను చేయి అందిస్తాను!” (గురువుగారు నవ్వుతూ) ఇలా మనల్ని మనం

సంక్లిష్టంగా మార్చుకుంటూ మన జీవితాలను గడిపేస్తాం. కానీ ఇటువంటి పరిహాసాలకు సరిపడా సమయం లేదు – కాలం గడిచిపోతుంది. కాబట్టి హేతుబద్ధంగా, అర్థవంతంగా ఉండటానికి ప్రయత్నించండి, సందర్భానికి తగినట్లు నడుచుకోండి! ఆయన ఇష్టానుసారం మీకు సహాయం చెయ్యడానికి పూర్తి అవకాశాన్ని ఇవ్వండి. ఆయన సాయం చేసే పద్ధతి మీకు నచ్చినా, నచ్చకపోయినా ముందు ఆయనకు ఆ అవకాశం ఇవ్వండి. ఆయన మీకు సాయం చేస్తున్నట్లని అనిపించకపోతే సహాయం చేసే మరొకరి కోసం అడగండి. అయితే పూర్తిగా అనుభవంలోనికి తెచ్చుకోకుండానే ఒక నిశ్చయానికి వచ్చి, అభిప్రాయాలు ఏర్పరచుకొని, నిర్ణయాలు చేస్తూ ఉండే మనస్సు గురించి జాగ్రత్త వహించండి.



**గురువుగారు :** బాబా చాలా అద్భుతంగా చెప్పారు: “ఈ ద్వారకామాయిలోనికి అడుగుపెట్టిన తక్షణం, కర్మ నశిస్తుంది. అది ఇకపై నా బాధ్యత” అని. ఎంత చక్కగా చెప్పారో చూడండి. **“ద్వారకామాయిలోనికి అడుగుపెట్టడం’ అనంటే భౌతికంగా అడుగుపెట్టడం అని కాదు, ఆయన బిడ్డగా మారడమని ఆయన ఉద్దేశ్యం.** ఒక్కసారి అన్ని పగ్గాలు బాబాకు అప్పగించిన తరువాత అది ఆయన బాధ్యత. ఆ క్షణం నుండి మీకు కర్మంటూ ఏమీ లేదు. ఒకవేళ మంచో, చెడ్డో ఏదైనా కర్మ ఉన్నప్పటికీ అది ఆయన బాధ్యత.

**భక్తుడు :** కానీ ఆ విధంగా పగ్గాలు అప్పగించడం నిజంగా కష్టమైన విషయం కాదా?

**గురువుగారు :** పగ్గాలు అప్పగించడమనేది మనవైపు నుండి జరిగే (మనం చేసే) చర్య కాదు. **అసహాయ భావోద్వేగపు స్థితిలో అసంకల్పితంగా జరిగే ప్రతిచర్య.** ఒక్కసారి నువ్వు “బాబా, ఇప్పుడు నాదంటూ ఏమీ లేదు, అంతా మీ చేతులలో పెడుతున్నాను, నువ్వే నడిపించాలి, నాకేమీ తెలియదు. అంతా మీ చేతుల్లోనే ఉంది” అని బాబాతో చెప్పిన తరువాత, ఆ భావోద్వేగపూరితమైన ఆ దృఢవిశ్వాసం, సంపూర్ణ విశ్వాసం వచ్చినపుడు, ఆ క్షణం నుండి నువ్వు ఏం చేసినా అది ఆయన బాధ్యతే.

**భక్తుడు :** అది అనుగ్రహం వలన జరుగుతుందా?

**గురువుగారు :** అవి రెండు వేర్వేరు విషయాలు కాదు. ఇంకా చెప్పాలంటే రెండు వ్యతిరేకమైన విషయాలూ కాదు. ఎందుకంటే నేను చెప్పిన మొదటిది (పగ్గాలు అప్పగించడం అనేది) మనవైపు నుండి జరిగే అసంకల్పితమైన ప్రతిచర్య. అది అనుగ్రహం వలన వచ్చి ఉండవచ్చు. అది రెండువైపుల నుండీ జరుగుతుంది. అందులో అనుగ్రహమూ, ఇంకా ఆ అనుగ్రహానికి మన ప్రతిస్పందన రెండూ ఉంటాయి.

**భక్తుడు :** సాయిబాబా తాత్వికపరమైన ప్రబోధాలు చేసేవారా?

**గురువుగారు :** లేదు, లేదు. ఆయన నుండి ఎవరూ అటువంటి వాటిని ఆశించలేదు. వాళ్లు ఆయన దగ్గరకు వెళ్లిన మరుక్షణం మహిమను చవిచూసారు. తమ అసహాయతను గుర్తించి ఆయన సహాయం



అర్థించి సహాయాన్ని పొందారు. ఆ సహాయం పొందే క్రమంలో వారికి బోధ కూడా అందేది. కాబట్టి మీరు చూసే ప్రతి లీల, ప్రతి సంఘటన, ప్రతి మహిమ, మీరు చదివే ప్రతి అనుభవం ఓ సందేశాన్ని తెలియచేస్తుంది. ఇతర మహాత్ముల దగ్గరకు వెళ్లినవారు, వారి వద్ద నుండి ఆ బోధను ఆశించారు. వాళ్ల వద్దకు వెళ్లిన వెంటనే "మాకు జ్ఞానాన్ని బోధించండి, బ్రహ్మం అంటే ఏమిటి, ఆత్మ అంటే ఏమిటి? ఇలాంటి విషయాలు అడిగేవారు. అందువల్ల ఆ మహాత్ములు వాటిని బోధించారు. బాబా సాన్నిధ్యంలో పూర్ణమైన సంతృప్తిని పొందడం వలన బాబా వాచా బోధించలేదని ఎవరూ కొరతగా భావించలేదు. మన అసహాయతను తొలగించుకోవడానికి, ఆ ఆనందానుభూతిని పొందడానికి బోధ అవసరమవుతుంది. కానీ బాబా సన్నిధిలో ఆనందానుభవం దానంతటదే అనుభవమైనపుడు మిగతావాటి అవసరం ఏముంటుంది?

## లభించిన దానితో తృప్తిపడు

**యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః**
**సమః సిద్ధావ సిద్ధౌచ కృత్వాఽపి న నిబధ్యతే ॥ (4అ॥-22శ్లో)**

ఫలితము యెడల దృష్టిలేకుండా పనిని చేసికొంటూ పోయేవారికి సరియయిన ఫలితం ఎప్పుడూ లభించగలదు. ఆ లభించిన ఫలితాన్ని తృప్తిగా, సంతోషంగా స్వీకరిస్తూ సాగిపోవాలి. సుఖదుఃఖాలు, లాభనష్టాలు ఇలాంటివి ద్వంద్వాలు. వీటిని ఒకటిగా స్వీకరించగల స్థితికి రావాలి! ఎదుటివారిని చూచి, వారి సుఖసంతోషాలను చూచి వేష్టపడటం మాత్సర్యం. అది తొలగిపోవాలి. సిద్ధి, అసిద్ధి అది ఏదయినా ఒకటిగా గోచరించాలి! చేసినదానికన్న ఎక్కువ ఫలితాన్ని కోరేవారుంటారు. చేస్తున్నట్లు నటిస్తూ ఫలితాన్ని పొందుదామనుకునేవారుంటారు. అసలు చేయకుండానే ఫలితం అప్పనంగా వచ్చేస్తే అనుభవిద్దామనుకునే వారుంటారు. ఎన్ని పూజలు చేసినా ఈ మూడువిధాల వారు తమ బుద్ధిని సరిచేసికోనిదే దేవునికి దగ్గర కాలేరు. చేసిన పనికి తగిన ఫలితం లభిస్తూ ఉంటుంది. అది ఎప్పుడెప్పుడు ఎంతెంతగా లభించాలి అన్నది దైవంచేత నిర్ణయింపబడుతూ ఉంటుంది. ఆ ఫలితాన్ని ఆనందంగా అందుకుంటూ జీవితాన్ని దేవుని ప్రసాదంగా అనుభవించాలి.

ఒక్కొక్కప్పుడు మన మెతకదనంవలన తగిన ఫలితం లభించని స్థితి ఏర్పడుతూ ఉంటుంది. అప్పుడు మెతకదనాన్ని వదిలిపెట్టి దేవునిప్రార్థనతో తగినఫలాన్ని సాధించుకోవాలి. మంచితనమంటే మెతకదనం కాదు. మెతకదనం ఏ విషయంలోనూ మంచిదికాదు.ఒకవేళ తగిన ఫలితాన్ని మనంతట మనం సాధించుకోలేని స్థితులు ఏర్పడ్డాయి అనుకోండి. అప్పుడు దైవమే ఏదో ఒక రూపంలో మన మధ్యకు వచ్చి సారథ్యం వహించి, తగిన ఫలితాన్ని అందేటట్లుగా చేసి మరీ వెళతారు. అలా వచ్చిన మూర్తులనే మనం



పెద్దలు, నాయకులు, మార్గదర్శకులు అంటున్నాం.

ఏ విధంగా చూచినా మనిషికి అతడు చేసిన పనికి తగిన ఫలితం ముట్టచెప్ప బడుతుంది. అది అప్పుడే కాకపోవచ్చు. అప్పుడప్పుడు అందించబడవచ్చు. ఎప్పుడో మనం మరచినరోజున ఎదుట ఉంచబడవచ్చు. దైవం మాత్రం సేవచేసిన దానికి ముట్టచెప్పకమానదు. ఈ సృష్టిలో ఎవరి కృషీ వృధాపోదు. అతడు పోనీయడు. ఫలితంమీద దృష్టిని వదిలి, కర్తవ్యకర్మను నిర్వహించుకుంటూ వెళ్లిపోవడమే మనం చేయవలసినది. పనిమీద పరిగెత్తుతున్న వాహనానికి ఇంధనమే అందదా! దానికొరకు అది వెతుక్కోవాలా? కర్తవ్యము వెంట సాగిపోతున్న మనిషికి కావలసినవన్నీ అవే అందుతాయని వేరేచెప్పాలా?

ద్వంద్వాలు అంటే జంటలు. సృష్టిగతమయిన ద్వంద్వాలు కొన్ని ఉన్నాయి. శీతోష్ణాలు మొదలయినవి. జీవితగతమయిన ద్వంద్వాలు కొన్నిఉన్నాయి సుఖదుఃఖాలు మొదలయినవి. వీటియెడల మనకు సమదృష్టి కలగాలి! వాటిని గూర్చి బోధపడిన కొద్దీ సమదృష్టి అదే కలుగుతుంది. సృష్టివ్యూహంలో వీటియొక్క అవసరమేమిటో ఎరిగినకొద్దీ అవి దేవుని లీలలుగానే మనకు భాసిస్తాయి. శీతాకాలం, వేసవికాలం రెండూ అవసరమే! కాని రెండు కాలాలలోనూ ఏవో కొన్ని ఇబ్బందులు మనకు కలుగుతూనే ఉంటాయి. ఇబ్బందులు కలుగుతున్నాయి కదా అని వాటిని వద్దు అందామా అంటే కాలచక్రం తిరగదు. సృష్టికథ నడవదు. కనుక ఆ కాలాల పరమార్థాన్ని ఎరిగి, ఏకాలంలో ఎలా నడవాలో ఆ ఏర్పాట్లు చేసుకొంటూ వాటికి అతీతంగా సాగిపోతున్నాం.

అలాగే కొన్ని సుఖాల్ని కలిగించే సన్నివేశాలు వస్తాయి. కొన్ని దుఃఖాన్ని కలిగించే సన్నివేశాలు వస్తాయి. సుఖమొచ్చినపుడు బాగానే ఉంటుంది. దుఃఖమొచ్చినపుడు తట్టుకోలేని స్థితి ఏర్పడుతుంది. సుఖమేమిటో దుఃఖమేమిటో మనకు తెలియాలి. తెలియకపోతే సుఖమొచ్చినపుడు ఆ సుఖంలో ఆదమరచి కర్మభ్రష్టులమవుతాం. అంటే ఆ సుఖాన్ని అనుభవిస్తూ పనిచేయకుండా సోమరిపోతులమై ఏదో కాలక్షేపం చేసేస్తూ ఉంటాం. అలాగే దుఃఖమొచ్చినపుడు కూడా! ఇంక ఇదంతా ఎందుకు? ఎవరికోసం? అంటూ నిశ్చేష్టులమయి, కర్తవ్యంవైపుకు మళ్లకుండా, కన్నీరుకారుస్తూ ఉండిపోతాం. కనుక వివేకం కోల్పోయినవేళ సుఖదుఃఖాలు రెండూ కర్మభ్రష్టతకే దారితీస్తున్నాయి. ఇది ఎంతో దుష్పరిణామం! ఆలోచించండి!అలాకాక సుఖదుఃఖాల స్వరూపస్వభావాలను గమనించండి! సుఖం మన ఇంద్రియాలను, మనస్సును ఉల్లాసపరుస్తుంది. ఆ ఉల్లాసంలో కర్తవ్యాన్ని నిండుగా నిర్వహించడం ద్వారా మరింత మంచిఫలితాలను సాధించడం జరగాలి. ఉద్యోగికి ప్రమోషనిచ్చేది మరింత బాగా పనిచేయమనా? ఆ సంతోషంలో ఇంటి దగ్గర శెలవుపెట్టి పడుకోమనా? మీరే చెప్పండి.



దుఃఖం మనస్సును, ఇంద్రియాలను కల్లోలపరుస్తుంది. అవి అతలాకుతలం అవుతాయి. ఈ దుఃఖం రెండు రకాలు. కాలధర్మంగా మనకు ప్రాప్తించేది ఒకటి. మనకు మనంగా సృష్టించుకునేది మరొకటి. ముసలితనం–మరణం మొదలయినవి కాలగతమయినవి. అవి దుఃఖాన్ని కలిగించినా, మన కొరకు ఆగవు. ఇక మనం చేసుకునే అవకతవకల వల్ల కొన్ని దుఃఖాలు వస్తాయి. అప్పుడు ఆత్మపరిశీలనతో కూడిన దుఃఖంవల్ల మనస్సు వికసిస్తుంది. తప్పును తెలుసుకుంటుంది. జ్ఞానాన్ని అందు కుంటుంది. ఇలా సుఖదుఃఖాల స్వరూప స్వభావాలను గమనించుకుంటూ ముందుకు సాగుతున్నవేళ ఇటు సుఖంలోను, అటు దుఃఖంలోనూ కూడా మనకు దైవమే గోచరిస్తాడు. రెండూ అతని స్వరూపాలే అని మనకు తెలుస్తుంది.

లాభనష్టాలు, జయాపజయాలు మొదలయినవి కూడా ఇలాంటి ద్వంద్వాలే! మనిషి లాభం కలిగిన వేళ పొంగిపోతాడు. నష్టం కలిగినవేళ కృంగిపోతాడు. రెండు సందర్భాలలోను పని చేయకుండా కూర్చుండిపోవడానికి అవకాశముంది. **రెండింటిలోనూ దైవాన్ని చూచినపుడు లాభం నుండి ప్రోత్సాహం లభిస్తుంది. నష్టం నుండి గుణపాఠం లభిస్తుంది. అపజయం వల్ల ఇంకా మనం సంతరిచుకోవలసింది ఏమిటో తెలుస్తుంది. కనుక అన్నీ అతడి లీలలే! అన్నీ అతడిలోనివే!** సమదృష్టి కలుగుతున్నకొద్దీ మన మనస్సు తోటివారిని చూచి వేష్టపడటం మానేస్తుంది. వీరు ఇలాగ, వారు అలాగ అనుకోవడం తగ్గిస్తుంది. ఎవరి పరిణామాన్ని బట్టి వారి ప్రవర్తనముంటుంది అని, అదే సమయంలో ఎవరికి కావలసిన శిక్షణ వారికి అందుతూ ఉంటుందని గ్రహించుకుంటుంది. సృష్టి ఒక శిక్షణ శిబిరంగా దానికి గోచరిస్తూ ఉంటుంది. ఎవరికి కావలసిన శిక్షణ వారు ఇక్కడ పొందుతున్నట్లు దానికి తెలుస్తుంది. ఆ శిక్షణలోని వైవిధ్యం భగవంతుని లీలా విశేషంగా గోచరిస్తుంది.

మనం అనుకున్నవి కొన్ని జరుగుతాయి. అపుడు దైవం మనపట్ల ఉన్నాడని సంతోషం కలుగుతుంది. కొన్ని జరగవు. అప్పుడు ఇంత నమ్మినా ఇదేమిటా అని బాధ కలుగుతుంది. అన్నీ జరిగితే బాగుండును అని మన ఉద్దేశం. కాని ఎప్పుడూ అలా జరుగదు. కొన్ని జరగనివి ఉంటాయి. మరేమిటి, అప్పుడు దైవం మనపట్ల లేనట్లా? మన భక్తి చాలనట్లా? ఆయన శక్తి చాలనట్లా? ఆ పనులెందుకు జరగడం లేదు. మన ఇంట్లో చిన్న బాబు ఉంటాడు. వాడు మనచుట్టూ తిరుగుతూ ఉంటాడు. మనం చేస్తున్న ప్రతి పనినీ గమనిస్తూ ఉంటాడు. ప్రతిదాంట్లోనూ ఎంతో కొంత వాడూ వేలుపెట్టాలని చూస్తూ ఉంటాడు. తెల్లవారి


**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com**

**సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

లేస్తే మనం అనేక రకాలయిన వస్తువులతో పనిచేస్తుంటాం. వాడు వెంట తిరుగుతూ 'అమ్మా! నాకు అదివ్వవా, ఇదివ్వవా?అని అడుగుతూ ఉంటాడు. ఒకసారి చూస్తాడు. చూసి ఇస్తాను, ఏది నేనూ చేస్తాను, అని గారాం పోతాడు. ఆ అడగబడినవి ప్రమాదం లేనివి అయితే మనం వాడికిస్తాం. ఇచ్చేటపుడు రెండు ఆలోచిస్తాం. ఈ వస్తువు వల్ల వీడికి ప్రమాదం జరగకూడదు. వీడివల్ల వస్తువు పాడుకాకూడదు. అలాంటి వస్తువులను ఎంచి వాడికి ఇస్తూ ఉంటాం. వాటితో వాడు ఆడుకుంటూ ఉంటాడు. వాడు అంతటితో ఊరుకోడు. ఆడుతూ, ఆడుతూ–తండ్రి గడ్డం గీసుకోవడం చూస్తాడు వాడు. "నాన్నా! నాకు కూడా అదివ్వవా?' అని అడుగుతాడు తండ్రి ఆ రేజర్‌ని ఇస్తాడా? ఈయగలడా? ఇస్తే ఆ తరువాత ఆ పిల్లాడి పరిస్థితి ఏమిటి? తండ్రి ఈయడు. పిల్లవాడు ఏడుస్తాడు. అప్పుడు తండ్రికి కొంచెం బుర్రపని చేస్తుంది. వాడికి కనబడకుండా రేజర్‌లోని బ్లేడు మాయం చేసి ఉత్తరేజర్‌ను వాడిచేతిలో పెడతాడు. దీన్ని మోసం అందామా? రక్షణ అందామా? సరిగా దేవుడి చర్యలు ఇలా ఉంటాయి. మనం అడిగిన వాటిలో మనకు ప్రమాదం లేనివి, నిజంగా అవసరమైనవి అతడు తప్పక ఇస్తాడు. ప్రమాదకరమైనవి, అవసరంలేనివి అడిగినపుడు అతడు మౌనం వహిస్తాడు. మనం మరీ గోలచేస్తే, ఇస్తున్నట్లు నటిస్తూ, మనలను రక్షించుకుంటూ పోతాడు. వైష్ణవ మాయను చూపుతాడు. ఇప్పుడు చెప్పండి. దేవుడు ఇలా చేయడం ధర్మమా, కాదా! మనం మన చిన్నపిల్లవాడితో ఎలా ప్రవర్తిస్తున్నామో, దేవుడు మనతో సరిగ్గా అలానే ప్రవర్తిస్తున్నాడు. ఏమంటారు? ఆలోచించి చూడండి.

రవీంద్రుడు ఒకచోట అంటాడు. స్వామీ, నిన్ను నేను చాలా అడుగుతూ ఉంటాను. అందులో కొన్నింటిని ఇస్తావు నీవు, కొన్నింటిని ఈయకుండా తప్పించుకుంటావు.స్వామీ! ఇచ్చిన వాటికి కృతజ్ఞుడను. ఈయని వాటికి మరింత కృతజ్ఞుడను. ఎందుకనో తెలుసా, నాకు తోచినదల్లా నేను నిన్ను అడుగుతూ ఉంటాను. నీవు ఓర్పుగా ప్రేమతో వింటూ ఉంటావు. అందులో నాకు ఈయదగినవి ఏవో నీవే ఎంచి మరీ ఇస్తావు. ఈయకూడనివి ఏవో కూడా ప్రేమతో నీవే గుర్తించి, వాటిని నాకు ఈయకుండా రక్షిస్తూ ఉంటావు.ప్రభూ! ఏమి నీ కరుణ! తెలిసీ తెలియని మానవుణ్ణి ఎంత ఓర్పుతో, నేర్పుతో నడిపించుకుంటూ వస్తున్నావయ్యా! అడిగింది ఈయడం నీ ప్రేమకు చిహ్నం. అది మానవుడు గుర్తిస్తాడు. అప్పుడు నిన్ను కీర్తిస్తాడు కూడా! అడిగింది ఈయకుండా ఉండటం ఉన్నదే అది నీ మరింత ప్రేమకు చిహ్నం. దానిని సామాన్యంగా మానవుడు గుర్తించలేడు. గుర్తించలేక నీ వైపు కోపంగా చూస్తాడు. కాని తరువాత ఎప్పటికో తెలుస్తుంది. అప్పుడు అది నీవెందుకు ఈయలేదా అన్నది. "ఓహో అందుకా ఈయబడనిది' అని అప్పుడు ఆశ్చర్యపోతాడు. నీ ముందుచూపును తాను ముందుగానే గ్రహించనందుకు నొచ్చుకుంటాడు. స్వామీ, నీ ప్రేమకు నా జోహార్లు. ఇలా రవీంద్రునిలా మనం కూడా దేవుని ముందు మోకరిల్లుదాం! ఆయన ఇచ్చినదే ప్రసాదంగా స్వీకరిద్దాం. ఆయన భాషను గమనించుకుంటూ, అవధులెరుగని ఆ ప్రేమను అనుభవిద్దాం. (అవధిలేని నీ కరుణను స్మరించి సిగ్గుతో కృంగిపోతున్నాను. బాబా నన్ను దీవించు!! నిత్యప్రార్థన)

దైవం అన్నది ఒక స్థితి మాత్రమే. దాన్ని ప్రతివారూ పొందవచ్చు - శ్రీబాబూజీ

ఆధ్యాత్మిక జీవన పునాదులు మన లౌకిక జీవనం మీద ఆధారపడి వున్నాయి. కాలంతో
శృతి కలపడం అంటే సృష్టితో శృతి కలపడం. (ఏదోలా గడిపేయడమే మన
నేపథ్యమయితే - బండరాయికి, మనకు బేధం లేదు)
సృష్టితో శృతి కలపడం అంటే దైవంతో శృతి కలపడమే (ఏదోలా చేయడమే మన
దృక్పథమైతే మనకు, మూగజీవాలకు తేడా లేదు.)
మానవుడు దివ్యత్వాన్ని అందుకోవాలని (మానవుడు-మాధవుడిగా,
నరుడు- నారాయణుడిగా, భక్తుడు-భగవంతుడిగా) అలా అందుకోవడం
సాధ్యమేనని సూచించడమే మహాత్ముల జీవనశైలి.

-గురుకృప

